# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :02 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 22-02-2025 | పేజీలు:4 వెల: 2.00


### బీజేపీకి 'బీ' టీమ్‌లా కాంగ్రెస్.. రాహుల్‌కు మాయావతి కౌంటర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి గట్టి కౌంటర్ ఇచ్చింది బీఎస్పీ నేత మాయావతి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ వ్యవహరించిందని, దాని వల్లే ఢిల్లీలో బీజేపీ గెలిచినట్లు మాయావతి పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో.. ఇండియా కూటమికి బీఎస్పీ మద్దతు ఇవ్వలేదని, ఇది నిరుత్సాహానికి గురిచేసినట్లు ఇటీవల రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బెహన్‌జీ తమతో కలిసి పనిచేస్తే, బీజేపీ నెగ్గేది కాదన్నారు. రాహుల్ చేసిన ఆరోపణలకు ఇవాళ మాయావతి కౌంటర్ ఇచ్చారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఆమె పోస్టు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ పనిచేసిందన్న విషయం అందరికీ తెలుసు అని, దాని వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరిస్థితిలో ఉందని, కనీసం ఆ పార్టీ అభ్యర్థులకు చాలా చోట్ల డిపాజిట్ కూడా దక్కలేదని ఆమె తెలిపారు. ఇతరుల పట్ల వేలు పెట్టి చూపే ముందు, తన స్వంత వ్యవహారాల గురించి సమీక్ష చేసుకోవాలని కాంగ్రెస్ నేతకు మాయావతి సూచన చేశారు.

## రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ..పట్టు వస్త్రాలు సమర్పించిన రేవంత్





వికారాబాద్: వికారాబాద్ జిల్లా పోలేపల్లిలో రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఆలయానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు రేవంత్రెడ్డికి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న రేవంత్ కు వేదపండితులు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ పర్యటన సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## కెసిఆర్ బాటలోనే రేవంత్...

మెదక్ : బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ ఆయన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకున్నారని, ప్రస్తుతం రేవంత్ కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మాయా గార్డెన్స్ లో బిజెపి జిల్లా అధ్యక్షుడి వాల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలోఎంపీ రఘునందన్ రావు తో కలిసి కేంద్ర మంత్రి మాట్లాడుతూ, మోసపూరిత హామీలతోనే కాంగ్రెస్ మనుగడ కొనసాగిస్తున్నారని అన్నారు. "అశోక్ నగర్ లో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. 14 నెలలు అయినా వారి గురించి కానీ జాబ్ క్యాలెండర్ గురించి పట్టించుకోవడం లేదు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఉద్యోగులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, డిఎ లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చింది. మారింది కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి కానీ తెలంగాణ పరిస్థితి మారలేదు అంటూ వ్యాఖ్యానించారు.

ప్రకటనలలో ముందు పనులే మృగ్యం ..

"అభివృద్ధి పనులు అన్ని కుంటుపడ్డాయి. సీఎం మాటలు కోటలు దాటుతున్నాయి.. ప్రకటనలు ముందు పేజీలో ఉన్నాయి పనులు మాత్రం లేవు. కాంగ్రెస్ మంత్రుల మధ్య సమన్వయం లేదు. శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అవినీతి బాగా పెరిగింది. హిమాచల్ ప్రదేశ్ లో కరెంట్ బిల్లులు కట్టలేక, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు అమలు కావడం లేదు. బీజేపీపాలిత రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ సమర్థవంతంగా పని చేస్తూంది. తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో ప్రజా పోరాటాలకు సిద్ధమవుతాం." అని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

ఈ ఎన్నికల తెలంగాణ దశ, దిశను నిర్దేశిస్తాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని కిషన్‌రెడ్డి



అన్నారు.. "బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో చేతులెత్తేసింది. ఈ ఎన్నికలు తెలంగాణ కి దశ దిశ నిర్దేశిస్తాయి. కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల రాష్ట్రం అయ్యింది.. అహంకారం పెరిగిందని కాంగ్రెస్ నేతలు చెప్పి అధికారంలో వచ్చారు. ఆరు గ్యారెంటీలు, జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ 14 నెలలు కావస్తున్నా ఏ పనులు చేయట్లేదు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఇచ్చిన ఏ హామీ కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదు. ఉద్యోగాలు ఇస్తామని యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పింది." అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ లో మంచి పాలన రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని వివరించారు. ఎంపీ ఎన్నికల్లో 8మంది బీజేపీ అభ్యర్థులను గెలిపించారని తెలిపారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అన్ని వర్గాల సమస్యల పై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి లకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## సర్వేలన్నీ బీజేపీ వైపే..కేంద్ర మంత్రి



పెద్దపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ సర్వే చూసినా బీజేపీ బలపర్చిన అభ్యర్థుల విజయం తథ్యమని చెబుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలియజేశారు. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార వ్యూహంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ. ఈ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలంతా తమ పౌరుషాన్ని, దమ్ము చూపాలన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులుగా గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. తెలంగాణలో బీజేపీని ఒక్కసారైనా అధికారంలోకి తీసుకురావాలని లక్షలాది మంది కార్యకర్తలు కల కంటున్నారని, ఎంతో మంది ఆ కల నెరవేరకుండానే చనిపోయారన్నారు. ఈసారి బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. నక్సలైట్ల తూటాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ నాయకులకే ఉందన్నారు. పెద్దపల్లి జిల్లాలోనూ గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్ రావు, కాశీపేట లింగయ్య, కోమాల అంజనేయులు వంటి వారిని చంపాలని నక్సలైట్లు పెద్ద పోస్టర్లు కూడా వేశారన్నారు. అయినా భయపడకుండా నక్సలైట్లకు ఎదురొడ్డి పోరాడి కాషాయ జెండాను రెపరెపలాడించారన్నారు. బీసీలకు రిజర్వేషన్ల పేరుతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మనకు గోత్రం, జన్మ నామం, జన్మ నక్షత్రం ఉంటుందని, మన సంప్రదాయాలు వేరని, మరి హిందువుల జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారన్నారు. ఒకవైపు బీసీ జనాభాను తగ్గించి చూపుతున్నారని, ఇంకోవైపు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, అందులో 10శాతం ముస్లింలకే ఇస్తున్నారన్నారు. బీసీలకు ద్రోహం చేస్తుంటే ఎట్లా ఊరుకుంటామని, అందుకే బీసీ జాబితాలో ముస్లింలను కలిపి బిల్లు పంపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. వెనక్కు తిరిగి పంపుతామని, ముస్లింలను మినహాయించిన తరువాతే బీసీ బిల్లును ఆమోదిస్తామన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలతోపాటు బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఒక్కరోజు కూడా కాలేదు.. అప్పుడే అతిషి విమర్శలా?

న్యూఢిల్లీ,తొలి కేబినెట్ సమావేశంలోనే మేనిఫెస్టో హామీలు నెరవేరుస్తామని చెప్పి చేయలేదన్న మాజీ సీఎం అతిషి ఆరోపణలను ముఖ్యమంత్రి రేఖా గుప్తా తిప్పికొట్టారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయని ఇన్నేళ్లు మీరేం చేశారో చూసుకోవాలని హితవు పలికారు. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కాలేదు.. అప్పుడే విమర్శలు చేస్తారా..? అంటూ మండిపడ్డారు. తొలి రోజే కేబినెట్ సమావేశం జరిపామని.. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఈ పథకంతో రూ.10 లక్షల మేర వైద్య సహాయం అందనుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఆప్ ప్రభుత్వం అమలు చేయలేదని.. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదని పేర్కొన్నారు. ఆప్ నుంచి చాలా మంది పార్టీని వీడాలని



చూస్తున్నారని.. ముందు మీ పార్టీ గురించి చూసుకోవాలని అతిషికి సూచించారు.

## ఏపీ నీటి దోపిడీతో.. తెలంగాణలో సాగు, తాగు నీళ్లకు కటకట

హైదరాబాద్: తెలంగాణకు ఏమైనా ద్రోహం జరిగిందంటే దానికి కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, చంద్రబాబు నాయుడు, ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి బాధ్యులని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. నీళ్లలో నిప్పులు పుట్టించి ఉద్యమం నడిపిన పార్టీ తమదన్నారు. తెలంగాణపై అన్ని విషయాల్లో పరిశోధించిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. నీటి వాటాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస సోయి లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, బొల్ల మల్లయ్య యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా నీళ్ల దోపిడీ జరుగుతున్నదని, అడ్డుకోవాలని హరీశ్ రావు సలహా ఇచ్చారన్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో వాటాకు మించి ఏపీ నీళ్లు తీసుకెళ్తున్నదని చెప్పారు. సాగర్ ఎడమ కాలువ కింద సాగు, తాగు నీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మన హక్కుగా ఉన్న 123 టీఎంసీల గురించి మాట్లాడాలన్నారు. నీటి విషయంలో మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలపై మాట్లాడటం మానేసి కేంద్రం, చంద్రబాబును ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్ అవినీతి గురించి ప్రజలే మాట్లాడుకుంటున్నారని చెప్పారు. 'తెలంగాణ దాచిపెట్టుకున్న కృష్ణా నీళ్లను ఏపీ ఎత్తుకెళున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. ఏపీ నీటి దోపిడీతో తెలంగాణలో సాగు, తాగు నీళ్లకు కటకట ఏర్పడే పరిస్థితి ఉందని హరీశ్ రావు చెప్పారు. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ చెత్త మాటలు మాట్లాడారు. ఉత్తమ్‌వి ఉత్తరకుమార మాటలు. రాష్ట్రానికి పొంచి ఉన్న ప్రమాదం గురించి మాట్లాడితే కాంగ్రెస్ నేతలు రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ అన్యాయం చేసింది కాంగ్రెస్, బీజేపీలే. తెలంగాణకు సరైన నీటి వాటా దక్కకపోవడానికి చంద్రబాబు, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బీజేపీలే కారణం. ఉత్తమ్ కుమార్ ఎవరో రాసిచ్చింది చదివారు. రేవంత్ రెడ్డి తిట్లతో సీఎం అయ్యారు. తాను కూడా అదే భాషతో మాట్లాడితే ముఖ్యమంత్రి అవుతానని ఉత్తమ్ అనుకుంటున్నారేమో. పదేండ్ల కేసీఆర్ పాలనలోసాగు తాగు నీళ్లకు ఎలాంటి కష్టం రాలేదు. రేవంత్ రెడ్డి మాట్లాడిన చెత్తనే కేసీఆర్ మీద ఉత్తమ్ మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడాల్సింది కేంద్రం మీద. పక్క రాష్ట్రం చంద్రబాబు మీద, ఏపీలో ప్రాజెక్టుల మీద. ప్రాజెక్టుల విషయంలో జగన్, చంద్రబాబు ఒకే వైఖరితో ఉన్నారు. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రాజెక్టులు కడుతుంటే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. పోతిరెడ్డిపాడును వ్యతిరేకించి ఆనాడు మా పార్టీ వైఎస్ కేబినెట్ నుంచి బయటకు వచ్చింది. మాట్లాడుకుంటే తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహ చరిత్ర చాలా ఉంది. కృష్ణా జలాల్లో 50 శాతం వాటా కోసం ప్రయత్నిస్తున్నామని ఉత్తమ్ అంటున్నారు. ముందు ఉన్న పంటలను కాపాడటంపై దృష్టి



పెట్టాలి. మోదీకి, చంద్రబాబుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి భయపడుతున్నారు. జగన్ సీఎంగా రాష్ట్రానికి వస్తే గౌరవించుకోవద్దా. మీరు చంద్రబాబు దగ్గరికి క్యూ కట్టలేదా. మాట్లాడటానికి సిగ్గు ఉండాలి. కాంగ్రెస్ అవినీతి గురించి మాట్లాడుకుంటే అవినీతి అనే పదమే సిగ్గుపడుతుంది. ప్రతి దాంట్లో కమిషన్ అడుగుతున్న కాంగ్రెస్ నేతలా కేసీఆర్ గురించి మాట్లాడేది. మంత్రుల అవినీతి సంపాదన చిట్టా మా దగ్గర ఉంది. ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల దగ్గర మంత్రులు కమిషన్ తీసుకుంటున్నారు. పంటలను కాపాడుకోవడానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు మనకు దక్కాల్సిన కృష్ణా జలాలు దక్కాలి. దీనికోసం బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుంది. మంత్రులు కృష్ణా జలాలపై సోయి లేకుండా సొల్లు పురాణం చెబుతున్నారు. కాళేశ్వరాన్ని ఎండబెట్టారు కాబట్టే గతంలో మాదిరిగా సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నీళ్లు రావడం లేదు. కేసీఆర్‌ను తిట్టడం బంద్ చేసి కృష్ణా జలాల వాటాను సాధించు కోవడం మీద మంత్రులు దృష్టి పెట్టాలి. మా హయాంలో పదిహేడు పంట సీజన్లకు నీళ్లిచ్చాం. కేసీఆర్ హయంలో ఏపీకి నీళ్లు అక్రమంగా తరలిస్తే ఇన్ని పంటలు పండటం సాధ్యమా?. రాష్ట్రంలో పెరిగిన పంట విస్తీర్ణం, పంట ఉత్పత్తికి సాగునీళ్ల సక్రమ వాడకమే కారణం. సర్పంచ్‌కు కూడా సమాధానం చెప్పలేని స్థాయి కాంగ్రెస్ నేతలది. వీళ్లా కేసీఆర్ గురించి మాట్లాడేది. ఇప్పటికైనా సోయి తెచ్చుకుని సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. అసలు నీళ్లను ఎట్లా కొలుస్తారో కాంగ్రెస్ నేతలకు తెలుసా. ఉద్యమం నుంచే టీఎంసీల గురించి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అవగాహన కల్పించారు. కేసీఆర్‌ను విమర్శించడానికి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి సిగ్గుండాలి. కేంద్ర మంత్రులుగా ఉన్న వారికే కేఆర్ఎంబీ అధికారులతో మాట్లాడి తెలంగాణకు రావల్సిన నీళు సాధించడం చేతకాదా' అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

## ఐదు రోజుల్లో ముగియనున్న మహాకుంభమేళా..



ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళాలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం అయిన ఈ మహా కుంభమేళా చివరి దశకు చేరింది. మరో ఐదు రోజుల్లో మహాకుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. గత ఆరు రోజులుగా రోజూ కోటి మందికిపైగా భక్తులు నదీ స్నానాలు ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో త్రివేణీ సంగమం లో పుణ్యస్నానాలు ఆచరించిన వారి సంఖ్య 58 కోట్లు దాటినట్లు అధికారులు తెలిపారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీన మహాకుంభమేళా ప్రారంభమైంది. ఫిబ్రవరి 26 శివరాత్రి వరకూ ఈ కుంభమేళా కొనసాగనుంది. దాదాపు 45 రోజులపాటూ జరిగే ఈ మహా కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 50 కోట్ల మంది భక్తులు వస్తారని యూపీ ప్రభుత్వం ముందుగా అంచనా వేసింది. అయితే, అంచనాలకు మించి భక్తులు తరలివస్తున్నారు. మరో ఐదు రోజుల పాటు భక్తుల రద్దీ ఇదేవిధంగా కొనసాగుతే.. మహా కుంభమేళాలాలో పవిత్ర స్నానాలు చేసే భక్తుల సంఖ్య 65 కోట్లు దాటుతుందని యోగి ప్రభుత్వం అంచనా వేస్తోంది. మహా కుంభమేళాలో చివరి రోజైన ఫిబ్రవరి 26న రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా.

## పర్వేష్ వర్మ.. మరో ఏక్‌నాథ్ షిండే అవుతాడా?

న్యూఢిల్లీ,ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 26 ఏళ్ల తర్వాత కాషాయ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేష్ వర్మకు ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని మీడియా కోడైకూసింది. కానీ చివరికి రేఖా గుప్తాను అదృష్టం వరించి సీఎం పోస్టు తన్నుకుపోయారు. ఆర్ఎస్ఎస్‌తో ఆమెకు మంచి సంబంధాలు ఉండడంతోనే సీఎం పదవి ఆమెకు దక్కిందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే సీఎం పదవి దక్కలేదన్న అసంతృప్తి.. పర్వేష్ వర్మ, ఆయన మద్దతుదారులకు ఉన్నట్లు సమాచారం. చాలా అసంతృప్తిగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన.. మరో ఏక్‌నాథ్ షిండే కావొచ్చన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీకి 48, ఆప్‌కు 22 స్థానాలు దక్కాయి. ప్రభుత్వానికి కావాల్సింది 35 సీట్లు ఉంటే సరిపోతుంది. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి కేజ్రీవాల్ 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అలాంటి రాజకీయ ఉద్దండును పర్వేష్ వర్మ ఓడించారు. 'జెయింట్ కిల్లర్'గా వర్మకు పేరుంది. అలాంటిది ఆయనకు సీఎం పదవి దక్కకపోవడంతో అసంతృప్తిలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక గతేడాది మహారాష్ట్రలో మహాయుతి కూటమి అధికారంలోకి వచ్చింది. అప్పుడు ఏక్‌నాథ్ షిండే వర్గం ముఖ్యమంత్రి పీఠాన్ని ఆశించింది. కానీ బీజేపీనే ఎక్కువ సీట్లు సాధించింది. దీంతో కాషాయ పార్టీ సీఎం పోస్టును ఇతరులకు ఇచ్చేందుకు ఇష్టపడలేదు. దీంతో చాలా రోజులు పంచాయితీ జరిగింది. చివరికి దేవేంద్ర ఫడ్నవిస్‌కు ముఖ్యమంత్రి పదవి దక్కింది. మొత్తానికి ఏక్‌నాథ్ షిండే మెత్తబడి.. డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. తాజాగా ఢిల్లీలో కూడా అదే పరిస్థితి ఏర్పడింది. పర్వేష్ వర్మ కూడా ముఖ్యమంత్రి పదవి కోసం చాలా ప్రయత్నాలు చేశారు. కానీ హైకమాండ్ చివరికి రేఖా గుప్తా వైపు మొగ్గు చూపింది. అయితే పర్వేష్ వర్మ.. భవిష్యత్‌లోఏక్‌నాథ్ షిండేలా చేసే పరిస్థితులు లేవని తెలుస్తోంది. అధిష్టానం చెప్పినట్లుగానే వెళ్లొచ్చని



సమాచారం. ఇక పర్వేష్ వర్మకు మంచి మంత్రి పదవినే కట్టబెట్టింది. మేనిఫెస్టో హామీలు నెరవేర్చే విధంగా కీలక పోస్టు అప్పగించింది. ఇక ముఖ్యమంత్రి రేఖా గుప్తా కంటే వర్మ చిన్నవాడే. ప్రస్తుతం ఆయన వయసు (47). ఇక వర్మ క్రమశిక్షణ నాయకుడిగా పేరుంది. కనుక రేఖా గుప్తాతో కలిసి వెళ్లొచ్చని తెలుస్తోంది. భవిష్యత్ ఎలా ఉంటుందో వేచి చూడాలి.

### మంచినీటి సమస్యపై దృష్టి పెట్టాలి

రంగారెడ్డి,ఫిబ్రవరి21: వేసవి తొంగి చూస్తున్నందున ఇప్పటికే గ్రామాల్లో నీటి సమస్యలు మొదలయ్యాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక నేతలు అన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేమాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద మురుగునీరు నిల్వకుండా, లైన్‌మెన్, వాటర్ గ్రిడ్,

## సంపాదకీయం

**శనివారం 22-02-2025**

# కొత్త మందులు డబ్బున్న వారికే

పెట్టుబడి, మార్కెట్లు చోదకంగా నడిచే అమెరికన్ ఆర్థిక వ్యవస్థపై, ఒక మందు చూపుతున్న ప్రభావం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆ మందు పేరు ఓజెంపిక్. అలాగే, ఓజెంపిక్‌తో పోటీ పడుతున్న విగవి, మొంజారో లాంటి మందులు కూడా. ఇవి డయాబెటిస్‌కు, స్థూలకాయానికి వాడే మందులు. ఈ మందులు అమెరికన్ సంపన్న వర్గాల జీవనశైలులను, వినియోగ ధోరణులను కూడా మార్చేస్తున్నాయి. అమెరికన్ పరిశ్రమలను కూడా ప్రభావితం చేస్తున్నాయట. ఇది ఓజెంపిక్ ఎకానమీ అట. జి.ఎల్.పి 1 అగోనిస్టులు అనే రసాయన నామంతో పిలవబడే ఈ మందుల మార్కెట్ 2024లో నాలుగు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని, 2032 కల్లా అది పదింతలు అవుతుందని లెక్కలు వేస్తున్నారు. ఇది వ్యక్తుల జీవితాలనే కాక, మొత్తం అమెరికన్ పరిశ్రమలన్నింటినీ ప్రభావితం చేస్తుందని ఒక అంచనా.

జి.ఎల్.పి 1 అంటే..

జి.ఎల్.పి 1 (గ్లూకగాన్ లైక్ పెప్టైడ్ 1, అనేది రసాయన నామం)ను 1980లో కనుగొన్నారు. ఇదొక హార్మోను. మానవ శరీరంలో, షుగర్‌ను నియంత్రించే మరో రెండు హార్మోన్లు- ఇన్సులిన్, గ్లూకగాన్-లపై జి.ఎల్.పి 1 ప్రభావం చూపుతుందని కనుగొన్నారు. అయితే ఈ జి.ఎల్.పి 1 హార్మోను శరీరంలో స్రవించిన వెనువెంటనే, చురుకుదనం కోల్పోవడం వల్లా, మందుగా ఉపయోగపడలేదు. చురుకుగా, స్థిరంగా కొంత కాలం పని చేయాలంటే, రసాయనికంగా వీటిలో కొన్ని మార్పులు చేర్పులు చేయాలి. అట్లా చేస్తే తయారైన మందులే జి.ఎల్.పి 1 అగోనిస్టులు. ఇవి షుగర్ వైద్యం మీద, ఒబెసిటీ వైద్యం మీద ఎంతగానో ప్రభావం చూపాయి. ఈ పరిశోధనా క్రమాలలో 2017లో, నోవా నాడెస్క్ కంపెనీ, సెమాగ్లటైడ్ లేదా ఓజెంపిక్ అనే మందును ఆవిష్కరించింది. ఇలై లిల్లి అనే కంపెనీ కూడా ఇటువంటి మందులనే ఆవిష్కరించింది. వీటి క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్నవారు 16 నెలల సమయంలో, 17-22 శాతం బరువు తగ్గారు. ఈ మందులలో కొన్ని స్థూలకాయానికి వాడుకోవచ్చనే అనుమతులు 2023లో లభించాయి. జి.ఎల్.పి 1 లపై కొత్త పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కొత్త మందుల్ని కనుక్కుంటూనే ఉన్నారు. గిలా మాన్స్టర్ అనే పెద్ద బల్లి జాతిలో ఉండే విషంలోని ఒక ప్రోటీన్ ఆధారంగా ఒక మందును తయారు చేశారు. ఈ పరిశోధనలు చేసింది కూడా నోవా నాడెస్క్, ఇలై లిల్లి కంపెనీలే. ఇందులో పబ్లిక్‌ఫండ్స్ ద్వారా జరిగిన శాస్త్ర పరిశోధనల పాత్ర ఉంది . నాడీ మండల రక్షణకు, పార్కిన్‌సన్ లాంటి జబ్బులకు, అల్జీమర్స్‌కు, ఈ మందులు పనిచేస్తాయని ఈ పరిశోధనలు తేల్చాయి. శాస్త్రవేత్తల పట్టు విడువని కృషి, ముందు చూపు వల్ల వీటి ఆవిష్కరణ సాధ్యమైంది. ఫిజియాలజీలో, బయో కెమిస్ట్రీలో జరిగే దీర్ఘకాలిక పరిశోధనలు మందుల తయారీలో చాలా ప్రభావవంతంగా ఉంటున్నాయి. జి.ఎల్.పి1 పై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలకు అనేక అవార్డులు వచ్చాయి. 2017లో హెరింగ్టన్ అవార్డు, కెనడా గైర్డనర్ ఇంటర్నేషనల్ ప్రైజ్, 2023లో మణి ఎల్ బౌమిక్ పేరున ఉండే బ్రేక్ త్రూ అవార్డు (2.16 కోట్ల రూపాయలు) వచ్చాయి. మొదటి నుంచి చూస్తే ఈ పరిశోధనలలో-స్వెత్‌లానా మాజ్ సవ్, డేనియల్ డ్రకర్, జెన్స్ జుల్ హోల్స్ట్, లోటే జెరే నుడ్ సన్, రిచర్డ్ డి మార్చి-లాంటి శాస్త్రవేత్తలు ముఖ్య పాత్ర వహించారు. అయితే వీరికి వచ్చిన గుర్తింపుల విషయంలో ఒక వివక్ష కూడా బయటపడింది.

మహిళా సైంటిస్టుపై వివక్ష

1980లలో జి.ఎల్.పి1 పైన జరిగిన తొట్ట తొలి పరిశోధనలలో పాల్గొన్నది, స్వెత్‌లానా మాజ్ సవ్ అనే ప్రతిభావంతురాలైన యుగోస్లేవియన్ మహిళా శాస్త్రవేత్త. బెల్‌గ్రేడ్ యూనివర్సిటీలో, ఫిజికల్ కెమిస్ట్రీలో మాస్టర్స్, అమెరికాలోని రాక్ ఫెల్లర్ యూనివర్సిటీలో బయో కెమిస్ట్రీలో పి.హెచ్.డి చేయడానికి 1972లో ఆమె అమెరికాకు వచ్చింది. ఆ తర్వాత పెప్టైడ్ విశ్లేషణలపై ఆమె మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో పరిశోధనలు చేసింది. అక్కడే క్రియాశీల జి.ఎల్.పి 1ను ఆమె కనుగొని నిర్ధారించింది. ఆమె ఆవిష్కరణల ఆధారంగానే, మొట్టమొదటి జి.ఎల్.పి 1 మందు తయారై, మార్కెట్లోకి వచ్చింది. అయితే ఆమె పోషించిన కీలక పాత్ర విస్మరణకు గురైంది. అవార్డులలో, పత్రికలలో ఈ పరిశోధనా ప్రస్తావనలు వచ్చినప్పుడు ఆమెను పక్కన పెట్టారు. సైన్సు అధికార పీఠాలలో తిష్ఠ వేసి ఉన్న వారికే, మామూలుగా గుర్తింపులు కూడా వస్తాయి. ముఖ్యంగా మగవారికి వస్తాయి. అంతగా ప్రాచుర్యంలో లేని వారు, ముఖ్యంగా మహిళా శాస్త్రవేత్తలు, ప్రతిభ ప్రదర్శించినా, గుర్తింపులకు నోచుకోరు. మాజ్ సవ్ తన గురించి తాను పది మందిలో ప్రచారం చేసుకొనేది కాదు. అయితే ఆమె అభిమానులు, స్నేహితులు ఆమె తరపున గొంతు విప్పారు. న్యూయార్క్ టైమ్స్ జి.ఎల్.పి 1 పై ప్రచురించిన ఒక వ్యాసంలో ఆమె ప్రస్తావన లేదు. నేచర్ పత్రిక, సెల్ పత్రిక (2021) లలో వచ్చిన వ్యాసాలలో కూడా ఆమె పేరు విస్మరణకు గురైంది. ఆమె మిత్రులు జోక్యం చూసుకుని, దీన్ని ఎత్తి చూపిన తరువాతే, ఆ యా పత్రికలన్నీ సవరణలు ప్రకటించాల్సి వచ్చింది. ఆమె పని చేసిన మసాచుసెట్స్, జి.ఎల్.పి పై పేటెంట్ హక్కులకు దరఖాస్తు చేసినప్పుడు, మాజ్ సవ్‌కు కనీస సమాచారం అయినా అందించలేదు. ఆవిష్కర్తగా, ఆమె పేరు జోడించకుండా, జోయల్ హబెనర్ అనే శాస్త్రవేత్త పేరును మాత్రమే పేటెంట్ పత్రాలలో పొందుపరిచింది. రెండేళ్ల తర్వాత పేటెంట్లు వచ్చాయి. అందులో ఆమె పేరును సమాన హోదాగల సహ ఆవిష్కర్తగా, న్యాయంగా జోడించడానికి ఆమె ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. జి.ఎల్.పి అంశంలోనే, మరో రెండు కొత్త పేటెంట్లకు ఇదే సంస్థ అప్లై చేసుకున్నది. మళ్లీ మామూలే. మాజ్ సవ్ పేరు లేదు. చివరకు చాలా ఏళ్ల పోరాటం తర్వాత 2004లో, 2006లో ఆవిష్కర్తగా మాజ్ సవ్ పేరును రెండు పేటెంట్లలోనూ చేర్చాల్సి వచ్చింది. చిట్టచివరికి 2024లో మాజ్‌సవ్‌కు 'లాస్కర్ డి బకే' క్లినికల్ మెడికల్ రీసెర్చ్ అవార్డు దక్కింది. నుడ్ సన్, హాబెనర్ లతో కలసి ఆమె ఈ అవార్డును పంచుకున్నది. "స్థూలకాయానికి సంబబంధించిన వైద్యాన్ని విప్లవాత్మకంగా మార్చివేసిన జి.ఎల్.పి 1 మందుల ఆవిష్కరణకు, అభివృద్ధికి గాను" ఈ అవార్డును ఇస్తున్నట్టుగా ప్రకటించారు.

తరువాత ఏం జరగనున్నది?

ఈ ఔషధాలు, ఒక్క స్థూలకాయ వైద్యానికే పరిమితం కాలేదు. వివిధ రూపాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ మందులు గుండెపోటుకు, పక్షవాతానికి, మూత్రపిండాల జబ్బులకు కూడా పని చేస్తాయని క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. కొన్ని రకాల జి.ఎల్.పి 1 మందులు అల్జీమర్స్, పార్కిన్‌సన్ వ్యాధులలో తోడ్పడతాయంటున్నారు. అలాగే డీఅడిక్షన్ వైద్యంలో కూడా. ఒక పక్కన ఈ మందులకు డిమాండ్లు పెరుగుతున్నా, అవి అందరికీ అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఈ మందులు వాడితే ఒక మనిషికి సంవత్సరానికి 8.6 లక్షల రూపాయల ఖర్చు వస్తుంది. అమెరికా జనాభాలో కూడా 1.7 శాతం మందికి మాత్రమే ఈ ప్రిస్క్రిప్షన్లు రాశారు. వీటికి, చాలా సందర్భాలలో ఇన్సూరెన్స్ లేదు. అంటే ఈ మందుల్ని చాలా కాలం స్థిరంగా వాడాలంటే, ఖర్చు రీత్యా వీలు కాకపోవచ్చు. జనరిక్ మందులుగా ఇవి ఉత్పత్తి అవుతాయనే ఆశలు ఉన్నాయి. కానీ మేధో సంపత్తి హక్కుల అడ్డు ఉంది. ఈ నేపథ్యంలో భారతదేశంలో కూడా నూతన జి.ఎల్.పి 1 ఔషధాల ప్రవేశం సమీప భవిష్యత్తులోనే జరగనున్నది.

# 'ఆపరేషన్ కగార్'తో జరిగేదేమిటి?



హైదరాబాద్,నక్సలైట్ ఉద్యమం పూర్తిగా హింసను వది లిపెట్టి ప్రజాస్వామ్య వ్యవస్థలో పాల్గొనా ల్సిన అవసరం ఉంది. అలాగే, ప్రభుత్వం తిరుగుబాటుదారుల ప్రాథమిక సమస్యల ను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవా లి. భూసంస్కరణలు, గ్రామీణ అభివృద్ధి, సామాజిక, -ఆర్థిక, న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. తిరుగుబాటుదారులకు సామాజిక జీవితంలో తిరిగి చేర్చేందుకు పునరావాస ప్రణాళికలు రూపొందించాలి. సాయుధ పోరాటం ద్వారానే మార్పును తేవగలదనే లక్ష్యంగా ఉండవచ్చు. కానీ, చారిత్రకంగా చూస్తే ప్రజాస్వామ్య మార్గమే స్థిరమైన పరిష్కారం. హింసను వదిలిపెట్టి ప్రజా స్వామ్య వ్యవస్థలో సమస్యలను పరిష్కరిం చుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధిని, శాంతిని సాధించవచ్చు.సమాజ మార్పును సాయుధ పోరాటం ద్వారా సాధించాలని ప్రయత్నించడం ఒక సిద్ధాంతానికి ఆచరణ రూపం కావచ్చు. కానీ చారిత్రక క్రమంలో దీర్ఘకాలిక సంఘర్షణలు భారీ ప్రాణ నష్టం చేకూరుస్తాయి. సామాజిక అస్థిరతలకు దారితీస్తుంది. దీనికి విరుద్ధంగా ప్రజాస్వామ్య విధానాలను అనుసరిస్తే ఆ సమస్యలను పరిష్కరించేందుకు, రాజకీయ లక్ష్యాలను సాధించేందుకు స్థిరమైన, సమగ్ర మార్గాన్ని అందిస్తుంది.గ్లోబల్ పీస్ ఇండెక్స్ నివేదికల ప్రకారం గత దశాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన వివిధ సాయుధ సంఘర్షణలు ప్రధానంగా అధికారం పట్ల నిషేధం విధించే ప్రబలమైన పాలక వ్యవస్థల కిందే చోటుచేసుకున్నాయి. ముఖ్యం గా మధ్యప్రాచ్యం, ఉత్తరాఫ్రికా, ఉప సహారా ఆఫ్రికాలో ఇవి మరింత తీవ్రంగా కనబడుతున్నాయి. ఈ హింస తీవ్ర మానవీయ సంక్షోభాలకు కారణమవ్వడంతో పాటు, ఆర్థిక పురోగతిని అడ్డుకుంటూ, సామాజిక సమగ్రతను చెదరగొట్టాయి. దీని విరుద్ధంగా, ప్రజాస్వామ్య పాలనను స్వీకరించిన దేశాలు ఎక్కువ స్థిరతను, అభివృద్ధిని సాధించాయి. ఉదాహరణగా కోల్డ్‌వార్ ముగిసిన తర్వాత, ప్రజాస్వామ్య మార్గాన్ని అవలంబించిన తూర్పు యూరోప్ దేశాలు, రాజకీయ స్థిరతను, ఆర్థిక వృద్ధిని అనుభవించాయి. మార్పు సులభంగా రాకపోయినా, దీర్ఘకాలికంగా ప్రజాస్వామ్యం, పౌరసంబంధాల పెరుగుదల, ప్రభుత్వ జవాబుదారీతనం, మానవ హక్కుల పరిరక్షణ వంటి ప్రయోజనాలను అందించింది.అరబ్ స్ప్రింగ్ ప్రజాస్వామ్య పోరాటానికి, సాయుధ పోరాటానికి మధ్య వ్యత్యాసాన్ని బహిరంగంగా చూపిస్తుంది. ట్యూనీషియాలో ప్రశాంత ఉద్యమం ప్రజాస్వామ్య సంస్కరణలకు దారి తీసింది. అయితే సిరియా లాంటి దేశాలు సాయుధ పోరాటంలో నలిగిపోగా, అవి తీవ్ర మానవీయ సంక్షోభాలను ఎదుర్కొంటూ తీవ్ర అస్థిరతను అనుభవించాయి. సమాచార విశ్లేషణలు కూడా ప్రజాస్వామ్య మార్గాన్నే సమర్థిస్తున్నాయి. జర్నల్ ఆఫ్ పీస్ రీసెర్చ్‌లో ప్రచురితమైన అధ్యయనంలో ప్రజాస్వామ్య దేశాలు, నియంతృత్వ పాలన కలిగిన దేశాలతో పోలిస్తే అంతర్గత సంఘర్షణలను తక్కువగా ఎదుర్కొంటాయని కనుగొన్నారు.భారతదేశంలోని నక్సలైట్, మావోయిస్టు తిరుగుబాటు, సామాజిక-, ఆర్థిక అసమానతలు, రాజకీయ వివక్షను ఎదుర్కొనే అసంతృప్తుల నుండి జన్మించింది. అయితే, ఇది సాయుధ పోరాటాన్ని ఆశ్రయించడంతో వేలాది మంది మరణించగా ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడింది. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీలో భూస్వామ్య వ్యవస్థ వ్యతిరేకంగా రైతుల తిరుగుబాటు నక్సలైట్ ఉద్యమానికి ఆరంభంగా మారింది. ఆ తర్వాత, ఇది పెద్ద ఎత్తున రక్తపాతం, విధ్వంసం సృష్టిస్తూ దేశంలోని తూర్పు, మధ్య, దక్షిణ భారత ప్రాంతాల్లో విస్తరించింది. 1980 నుండి 2015 మధ్యకాలంలో ఈ ఉద్యమం 20,012 మంది మరణాలకు కారణమైంది. ఇందులో 4,761 మంది నక్సలైట్లు, 3,105 మంది భద్రతా సిబ్బంది, 12,146 మంది సాధారణ పౌరులు ఉన్నారు. 2010 నుండి సంవత్సరానికి సగటున 417 మంది సాధారణ పౌరులు మావోయిస్టుల హింసకు బలయ్యారు.నక్సలైట్ హింస వల్ల పలు రాష్ట్రాల్లో పెట్టుబడులు తగ్గిపోయాయి, మౌలిక వసతుల అభివృద్ధి నిలిచిపోయింది, విద్య-, ఆరోగ్య సేవలు ప్రభావితమయ్యాయి. పేదరికం, వెనుకబడిన ప్రాంతాలు మరింత వెనుకపడటం జరిగింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం అనేక వ్యూహాలను ప్రయోగించింది. 2009లో ప్రారంభమైన ఆపరేషన్ గ్రీన్ హంట్ కింద 75,000 మంది సైనికులు, పారామిలిటరీ దళాలను నక్సలైట్ ప్రభావిత రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు.అయితే, దీనివల్ల కొంతమంది తిరుగుబాటుదారులను నిర్మూలించినా, అనేక మందిపై మానవ హక్కుల ఉల్లంఘనల ఆరోపణలు రావడంతో ఈ పోరాటం మరింత సంక్లిష్టంగా మారింది. పార్టీలు వేరైనా కాంగ్రెస్, బిజెపి నేతల అసలు లక్ష్యం ఈ దేశంలో అడవులు, గనులు, పోర్టులు, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజల సహజ సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేయడమే. కనుక ఈసారి చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ల సందర్భంగా హోం మంత్రి అమిత్ షా 'మావోయిస్టు రహిత భారత్ అనే స్వప్నం సాకారమవుతోంది' అన్నారు. త్వరలో దేశంలో 'మావోయిస్టు ఉద్యమం' అంతరిస్తుంద'ని అన్నారు. ఇంతకు ముందు చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు, ఇప్పుడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నప్పుడు నక్సల్స్‌ను రూపుమాపేందుకు ఫేక్ ఎన్‌కౌంటర్లతో సైనిక బలగాలతో వైమానిక దాడులు చేశారు. ఆధునిక ఆయుధాలతో ఉద్యమాన్ని అణచివేసేందుకు గట్టిగా కృషి చేస్తూనే ఉన్నారు. అయినా అది కొనసాగుతూనే ఉంది. కానీ ఎందరో నక్సల్స్ మరణించినా ఈ ఉద్యమం ఏం సాధించింది? ఆత్మపరిశీలన చేసికొని సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటే మంచిది. రాజ్యం బలంగా ఉంది. కక్షతో ఉంది. ఇప్పుడు ఉన్న దారి వెనుకకు తగ్గటం మంచిది.నక్సలైట్ ఉద్యమం దశాబ్దాలుగా సాగుతున్నా తన లక్ష్యాలను సాయుధ పోరాటం ద్వారా సాధించలేకపోయింది. దీని విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని స్వీకరించిన రాష్ట్రాలు మేలైన అభివృద్ధిని సాధించాయి. ఉదాహరణగా కేరళను పరిశీలిస్తే అక్కడ వామపక్ష రాజకీయాలు ప్రభావవంతంగా ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు కట్టుబడి ఉండటం వల్ల అది నక్సలైట్ హింసను నివారించగలిగింది. సమగ్ర భూసంస్కరణలు, సమాజ సంక్షేమ కార్యక్రమాలు, విద్య -ఆరోగ్య రంగాల్లో మెరుగైన అభివృద్ధి కేరళను మిగిలిన రాష్ట్రాల కంటే ముందుకు నడిపించాయి.ఇక ఢిల్లీలో అవినీతికి వ్యతిరేక ఉద్యమం నుండి ఉద్భవించిన ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించి విజయాన్ని సాధించింది. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి విద్య, ఆరోగ్యం, ఇతర ప్రజాసేవలను మెరుగుపరిచింది. ఇది ప్రజాస్వామ్య మార్గంలో మార్పు సాధ్యమనే విషయాన్ని నిరూపించింది. నక్సలైట్ ఉద్యమం పూర్తిగా హింసను వదిలిపెట్టి ప్రజాస్వామ్య వ్యవస్థలో పాల్గొనాల్సిన అవసరం ఉంది. అలాగే, ప్రభుత్వం తిరుగుబాటుదారుల ప్రాథమిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.భూసంస్కరణలు, గ్రామీణ అభివృద్ధి, సామాజిక, -ఆర్థిక, న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. తిరుగుబాటుదారులకు సామాజిక జీవితంలో తిరిగి చేర్చేందుకు పునరావాస ప్రణాళికలు రూపొందించాలి. సాయుధ పోరాటం ద్వారానే మార్పును తేవగలదనే లక్ష్యంగా ఉండవచ్చు. కానీ, చారిత్రకంగా చూస్తే ప్రజాస్వామ్య మార్గమే స్థిరమైన పరిష్కారం. హింసను వదిలిపెట్టి ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధిని, శాంతిని సాధించవచ్చు. నక్సలైట్ ఉద్యమం అసమానతల సమస్యలనుండి పుట్టినా హింసాత్మక మార్గాన్ని అనుసరించడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరిగింది. ప్రజాస్వామ్య మార్గాన్ని స్వీకరించడం ద్వారానే అసమానతలను తగ్గించి, అభివృద్ధి సాధించగలం. నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత శాంతి, న్యాయబద్ధమైన మార్పు రావాలంటే ప్రజాస్వామ్య మార్గాన్నే అనుసరించాలి.

# ఈ తరం.. ప్రగతిశీలతకు ఉదాహరణలు..



హైదరాబాద్,సూర్యాపేటలో మరో కుల ఆధారిత పరువు హత్య జరిగింది. వడ్లకొండ కృష్ణ అనే దళిత యువకుడు భార్గవి అనే బీసీ కులానికి చెందిన యువతిని తమ ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్నందుకు ఆమె కుటుంబ సభ్యులే అతన్ని జనవరి 26న దారుణంగా హతమార్చారు. ఇది సుపారీ హత్య కాదు. భార్గవి కుటుంబ సభ్యులే తమ స్నేహితులతో కలిసి కృష్ణని చంపేశారు. ఈ హత్యలో భార్గవి అన్నలతో పాటుగా ఆమె నానమ్మ, నాన్న కూడా పాల్గొనడం విస్తుగొలిపే అంశం.ఒక కుటుంబంలోని మూడు తరాలు కలిసి చేసిన దారుణ నేరమిది. మొదటి తరానికి హత్య చేయడానికి కూడా వెరవనివ్వని కులోన్మాదం పోలేదు. రెండో తరానికి తామూ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో బాధితులమేనన్న జ్ఞానం లేకపోగా తమ కంటే ఒక మెట్టు కిందనున్న వారి పట్ల తన పైనున్న వాడు తన పట్ల ఎంత కర్కశంగా వుంటాడో అంతే కర్కశంగా ఉండకూడదన్న ఇంగితం లేదు. ఇంకా మూడో తరానికి సమాజానికి అవసరమైన నాగరిక విలువలు, చట్టాల పట్ల, రాజ్యాంగం పట్ల గౌరవం, మానవ సంబంధాలలో ప్రజాస్వామిక సంస్కారాలు ఏ మాత్రం వంట పట్టలేదు.

అమ్మాయిని కాదు.. ఆస్తిని తన్నుకుపోతాడా?

మన సమాజం శ్లాఘించే దుర్మార్గ విలువల్లో కులం చాలా ముఖ్యమైనది. ఏ మనిషైనా ఒకే రకంగా పుడతారు. ఒకే రకమైన శారీరిక వ్యవస్థతో బతుకుతారు. కానీ కొన్ని కులాల్లో పుట్టిన శరీరాలు గొప్పవై పోతాయి. దోపిడీ నిరంతరాయంగా అమలవ్వాలంటే తిరుగుబాటు గురించిన ఊహ కూడా భయపెట్టాలి. ఈ హత్య అనే కాదు కులాంతర, మతాంతర వివాహాల సందర్భంగా జరిగే ప్రతి హత్య వెనుక కేవలం పరువే కాదు, అంతకంటే మిన్నగా జెండర్ కోణం వుంటుంది. స్త్రీ ఒక మనిషిగా కాక కుటుంబానికి సంబంధించిన ఒక వ్యక్తిగత ఆస్తిలా భావించబడే లైంగిక వివక్ష వుంటుంది. ఆమె ప్రేమించినవాడో లేదా పెళ్లాడినవాడో తమ ఆస్తిని తన్నుకుపోతున్నవాడిలా కనబడతాడు. అందుకే ఇలాంటి కేసుల్లో ఆమె ప్రేమించిన, పెళ్లాడినవాడే హత్య చేయబడతాడు.

పై కులాల్లోని ఉన్మాదులను నమ్మొద్దు!

నిచ్చెన మెట్లల్లో అట్టడుగున ఉండేది దళితులే కనుక వారే హత్యకి గురవుతుంటారు. ఇది వాస్తవం. కనుకనే కులం ప్రమాదకరం, ప్రాణాంతకమనే స్పృహ అట్టడుగున వున్న బాధితులకే ఎక్కువ వుండాలి. వారే ఎక్కువ అప్రమత్తంగా ఉండాలి. మంథని మధుకర్, మిర్యాలగూడ ప్రణయ్, సూర్యాపేట కృష్ణ... ముగ్గురి జీవితాలే ఇందుకు ఉదాహరణ. అలాగని వారు నిచ్చెనమెట్లలో పైనున్న కులాల యువతులను వివాహం చేసుకోవద్దని కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ పై కులాల్లో వున్న ఉన్మాదులను నమ్మొద్దని మాత్రమే చెబుతున్నా. హంతకులు దాష్టీక కులాలకి చెందినవారు కాకపోవడంతో "కుల/మత ఆధారిత సేనలు/వాహినులు" హంతకులకు మద్దతుగా లేవు. రిజర్వేషన్ల మీద దాడులూ లేవు. కానీ బాధ కలిగించే విషయమేమంటే ఈ హత్యని ఖండిస్తున్న బీసీ సంఘాలూ లేవు (నా ఎరుక మేరకి).

భర్తల కుటుంబాలతోనే కలిసి ఉంటాం!

పోలీసులు ఆరుగురు హంతకుల్ని అరెస్ట్ చేశారు. హత్య జరిగినప్పటి నుండి తన కుటుంబ సభ్యులే కృష్ణని చంపారని భార్గవి మొత్తుకుంటూనే వున్నది. ఆమె అంటున్నదే నిజమైంది. ప్రణయ్ హత్యానంతరం అమృత ఎంత స్థిరంగా, నిర్భయంగా వున్నదో కృష్ణ హత్యానంతరం భార్గవి కూడా అంతే స్థిరంగా, నిర్భయంగా వున్నది. ఇద్దరూ కూడా తమ పుట్టిళ్లతో కాకుండా కడుపుకోతను ఎదుర్కొంటున్న తమ భర్తల కుటుంబాలతోనే కలిసి వుంటామని ప్రకటించారు. ఇద్దరూ బలహీనతలకు లోను కాకుండా పోరాట దృక్పథాన్ని ప్రదర్శించారు. ఇది వారి నిజాయితీని సూచిస్తున్నది. ఈ తరం ప్రదర్శించే ప్రత్యామ్నాయ ప్రగతిశీలతకి వారిద్దరూ ఉదాహరణలు..

### స్కూల్ హెడ్‌మాస్టర్ గది ముందు పసుపు.. కుంకుమ నిమ్మకాయలు

కరీంనగర్, కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ పాఠశాలకు ఎప్పటిలాగే విద్యార్థినీ, విద్యార్థులు ఉదయాన్నే యథావిధిగా వచ్చారు. ఒక్కసారి స్కూల్ ఆవరణలోకి అడుగుపెట్టేసరికి హెడ్ మాస్టర్ గది ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు చేసి, ముగ్గు వేసిన దృశ్యం ఆ విద్యార్థుల్ని ఆందోళనకు గురిచేసింది. పక్కనే చెల్లాచెదురుగా పడి ఉన్న నిమ్మకాయలతో ఏం జరిగి ఉంటుందన్న విషయం ఆ పసి హృదయాలకు అర్థం కాలేదు. వెంటనే వారి గురువుల వద్దకు విషయాన్ని తీసుకెళ్లారు. అప్పుడప్పుడే బడికి చేరుకుంటున్న టీచర్లూ ఆ క్షుద్రపూజల ముగ్గులు చూసి అవాక్కయ్యారు. అసలు ఎవరు చేసుంటారు ఈ పని అన్నది ఇప్పుడు దుర్శేడ్ జెడ్పీ హైస్కూల్‌లో చర్చనీయాంశంగా మారింది. పిల్లలను ఎవరైనా టార్గెట్ చేసుకుని ఏవైనా క్షుద్ర ప్రయోగాలు చేసుంటారా లేక, బళ్లో గురువులంటే పడనివారి పనయ్యుంటుందా లేక, మధ్యాహ్నం మాత్రమే బిజీగా ఉంటూ రాత్రంతా కామ్‌గా ఉంటుందని ఈ బడిని తమ క్షుద్రపూజల కోసం ఎంచుకుని ఉంటారా.. ఇలా పలురకాల అనుమానాలకు ఆస్కారమిచ్చింది.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

విశాఖపట్టణం,ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజాపక్షంగా ఉండే అభ్యర్థిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ బలపరిచిన కోరెడ్ల విజయ గౌరి ప్రజాపక్షంగా ఉంటారని ఆయన చెప్పారు. బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ? 2007లో శాసనమండలి పునరుద్ధరించిన తర్వాత గెలుపొందిన ఎమ్మెల్సీలు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) గా ఏర్పడి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, లెక్చరర్ల సమస్యలు, వారి ఉద్యోగ భద్రతపై ఎంతగానో కృషి చేశారన్నారు. పిడిఎఫ్ తరపున పోటీ చేసే ఏ ఒక్క అభ్యర్థి కూడా ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయబోరని, విరాళాలు వసూలు చేయరన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదన్నారు. పిడిఎఫ్ తరపున గెలుపొందే అభ్యర్థి భిన్నమైన వాణిని మండలిలో వినిపిస్తారని, ఇది తమ విధానం అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీగా పనిచేసిన తాను, అలాగే మిగిలిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇదే విధానాన్ని అమలు చేసి నిరూపించడం జరిగిందన్నారు. ఎన్నికలలో విలువలను ప్రచారం చేస్తామన్నారు. ప్రస్తుతం పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న విజయ గౌరి 30 సంవత్సరాల పాటు ఉద్యమాలలో ఉన్నారని, ఆమె కుటుంబం కూడా ఉద్యమాలతో ముడిపడి పనిచేస్తున్నారని తెలిపారు. మొదటిసారిగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పదవికి పిడిఎఫ్ తరఫున మహిళా అభ్యర్థిని పోటీలో నిలపడం జరిగిందన్నారు. గత ఆరున్నర సంవత్సరాలుగా ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు కారణంగా ఆరు లక్షల 50 వేల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు దూరం అయ్యారని చెప్పారు. 32 వేల ప్రాథమిక పాఠశాలలో మూతపడ్డాయన్నారు. ఇందువల్ల 12 వేల టీచర్ పోస్టులు రద్దు కాబడ్డాయని, ఇప్పటి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా మరికొన్ని ప్రాథమిక పాఠశాలలో మూతపడే పరిస్థితి ఉందని, 24 వేల టీచర్ పోస్టులు రద్దు అయ్యే వీలుందన్నారు. ఇష్టం వచ్చిన విధంగా పాఠశాలల విలీనం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, లెక్చరర్లు 1,24,000 మంది ప్రైవేటు టీచర్ల సమస్యలు దారుణంగా ఉన్నాయన్నారు. వీరికి పిఎఫ్, ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు వంటి సౌకర్యాలు లేవన్నారు. వీరిని కనీసం ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. గతంలో తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు 2018లో ప్రైవేటు టీచర్ల సమస్యలపై తీవ్ర స్థాయిలో పోరాటం చేయడం జరిగిందన్నారు. వీరికి సంక్షేమ బోర్డు, వేతన బోర్డు, ప్రత్యేక పెన్షన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాటం చేయడం జరిగింది అన్నారు. వీటిలో కొన్ని అమలు చేసేందుకు ఇస్తామని అంగీకరించిన ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదు అన్నారు. ఇటువంటి సమస్యలను పరిశీలించి, పరిష్కారం కోసం కృషి చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఃడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ? ప్రస్తుతం పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరి, జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులు పొందారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పైన, ప్రజా సమస్యల పైన ధర్నాలు, పికెటింగులు వంటి కార్యక్రమాల్లో పాల్గొని అరెస్టు అయిన సందర్భాలు ఉన్నాయన్నారు. మరో ఆరు సంవత్సరాల పాటు ఉపాధ్యాయురాలిగా కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, ఉపాధ్యాయ రంగానికి ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందుకోవాలని ఉద్దేశంతో ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీలో ఉన్నారని చెప్పారు. ఆమెకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ పాల్గొన్నారు.

## 22 నుంచి 24 వరకు కడపలో ప్రాజెక్టుల మహాసభలు

అనంతపురం, ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి త్రాగునీటి సాధనకై ఫిబ్రవరి 22 నుండి 24 వరకు కడప నగరంలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టులు మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పుట్లూరు మండల అరకటివేముల గ్రామంలో ప్రాజెక్టుల మహాసభ కరపత్రాలు విడుదల చేయడం జరిగినది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు మాట్లాడుతూ, కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమ శాశ్వతవిముక్తికి పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు పంట కాలువలకు పూర్తిగా నిధులు నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం, నికర జలాలు కేటాయించి ప్రతి గ్రామ పట్టణానికి త్రాగునీరు ప్రతి ఎకరాకు సాగునీరు, సాధించాలన్న లక్ష్యంతో మరో మారు ఉద్యమానికి సన్నద్ధం చేసేందుకు కడపలో జరుగు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, ప్రాజెక్టుల మహా సభను జయప్రదం చేయాలని కరువు సీమకు కృష్ణ జలాలే ఏకైక శరణ్యమని గతంలోనే రైతు సంఘాలు కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేశాయని ఆ పోరాటాల ఫలితంగా హంద్రీనీవా, గాలేరు, నగరి, ప్రాజెక్టులను తీసుకొని వచ్చారని కానీ నేటికీ ఈ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని, రాష్ట్రంలో రాయలసీమ పేరు చెప్పి అన్ని ప్రాజెక్టుల ను పూర్తి చేస్తున్నామన్నారు గాని రాయలసీమలో ఉండే ఎండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదన్నారు. వరుస కరువుతో ఇబ్బందులు పడుతూ వేసిన పంటలు పండక అప్పులు ఊబిలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలు, ఆకలి చావుల, వలసలకు అనంతపురం జిల్లా నిలయమైనదన్నారు..

## భర్తకు సేవ చేయాల్సి వస్తుందని...

హైదరాబాద్, కొందరు చిన్నచిన్న కారణాలు తమకు ఇబ్బందులు కలుగుతాయనే భావనతో హత్యలకు పాల్పడి కటకటాలపాలవుతున్నారు... భర్త కష్ట కాలంలో ఉన్నప్పుడు అతనికి తోడుగా ఉండాల్సిన భార్య అతనికి సేవ చేయాల్సి వస్తుంది అని.. అల్లునితో కలసి హత్య చేసింది. వివరాల్లోకి వెళ్తే.. పైగా దీనిని సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. కానీ అతని మెడపై కమిలిపోయిన గాయాలు ఉండటంతో.. మృతుడి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. కాగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట (మం) బాచారం గ్రామానికి చెందిన కర్రెల ఆశయ్య (45), శివ్వమ్మలకు కూతురు లావణ్య, కొడుకు శివకుమార్ ఉన్నారు. కాగా వీరికి ఉన్న ఎకరన్నర అసైన్డ్ భూమిలో పంటలు పండకపోవడంతో, హైదరాబాద్ నగరానికి కూలీలుగా వలస వెళ్లారు. కాగా రోడ్డు ప్రమాదంలో కొడుకు చనిపోవడంతో తిరిగి మళ్లీ వారి స్వగ్రామానికి వచ్చారు. కూతురు లావణ్యను జూకల్‌కు చెందిన రమేశ్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చారు. కాగా ఆశయ్య గ్రామంలోనే పశువులు కాస్తు ఉండేవాడు.. కాగా ఇటీవల వారికి ఉన్న పొలంలో బోరు వేసి, ఆ భూమిని వ్యవసాయనికి ఉపయోగంగా మార్చారు.. అయితే శని వారం పొలం పనులకు వెళ్లిన ఆశయ్య.. పొలం గట్టు పై నుంచి జారిపడగా, అతనికి తుంటి ఎముక విరిగింది..దీనితో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆశయ్యకు శస్త్ర చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఇంటికెళ్లిన తర్వాత వైద్య ఖర్చులు ఎలా భరించాలి అనుకున్నారో, అవిటితనంతో కుటుంబానికి భారమవుతాడని భావించారో, లేక రైతు బీమా కోసం ఆశ పడ్డారో తెలియదు

## ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం

విజయవాడ,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వీరుళ్లపాడు మండలం, గూడెం మాధవరం ఫీల్డ్ అసిస్టెంట్ మన్నే సుధీర్ సస్పెన్షన్‌కు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలిచ్చారు. గ్రామంలో వేతనదారులకు పనులు కల్పించడంలోనూ సగటు వేతనం విషయంలో జిల్లాలోనే అట్టడుగు స్థానంలో నిలిచినందున చర్యలు తీసుకున్నారు. అలాగే ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు, సమావేశాలకు హాజరుకానందున క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఆదేశాలిచ్చారు. ఈ విషయమై సుధీర్‌కు నోటీసులు కూడా జారీఅయ్యాయి. ఇదిలావుంటే జిల్లాలో క్షయను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు కలిసికట్టుగా అడుగేయాల్సిన అవసరముందని.. ఈ దిశగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఎన్‌టీఈపీ కింద చేపడుతున్న టీబీ నియంత్రణ కార్యక్రమాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, ఉచిత మందుల పంపిణీ, నిక్షయ్ పోషణ్ యోజన తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో టీబీ నిర్మూలన కూడా ప్రధానమైందని, ముఖ్యంగా వల్నరబుల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 2018లో ఏర్పడిన జిల్లాస్థాయి టీబీ ఫోరం కమిటీ ఏడాదికి రెండుసార్లు సమావేశ మవుతోందని.. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పకడ్బందీగా అమలుచేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 10 టీబీ యూనిట్ల ద్వారా ఎన్‌టీఈపీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. క్షయను తొలిదశలోనే గుర్తించడం వల్ల మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుందని, ఈ నేపథ్యంలో స్క్రీనింగ్‌కు చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాధి ఒకరినుంచి మరొకరికి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. టీబీ ఛాంపియన్ల సహకారంతోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోగికి చికిత్స సమయంలో నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా ప్రతినెలా రూ. వెయ్యి డీబీటీ ద్వారా అందించడం జరుగుతోందని.. ఇలాంటి ప్రభుత్వ మద్దతుతో పాటు మిగిలిన వారుకూడా నిక్షయ్ మిత్రలుగా ముందుకొచ్చి రోగులకు పోషకాహార బాస్కెట్లు అందించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు, కంపెనీలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయన్నారు. ప్రైవేటు ప్రాక్టీషనర్లు, ల్యాబ్స్, కెమిస్ట్స్ తదితరులు టీబీ కేసులపై ప్రభుత్వానికి సమాచారమిచ్చేలా పటిష్ఠ పర్యవేక్షణ అవసరమన్నారు. నియంత్రణలో వినూత్న చర్యలు చేపట్టే దిశగా స్థానిక సంస్థలను ప్రోత్సహించేందుకు టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమాన్ని కూడా అమలుచేయడం జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈకార్యక్రమంలో భాగంగా గుణదలకు చెందిన ఓ టీబీ ఛాంపియన్ వ్యాధిని జయించిన ఉదంతాన్ని వివరించారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో భాజపా ప్రభుత్వం కొలువుదీరగా, అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచిన విజేందర్ గుప్తా ను పార్టీ ఎంపిక చేసింది. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా పార్టీ తనను ఎంపిక చేయడంపై విజేందర్ గుప్తా హర్షం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 10 ఏళ్ల క్రితం అసెంబ్లీ నుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. తాజాగా ఆయన అదే సభకు స్పీకర్‌గా ఎంపిక కావడం గమనార్హం.2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే ఆల్కాలంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే అయిన విజేందర్ గుప్తాను అప్పటి స్పీకర్ ఆరోజు సాయంత్రం 4 గంటల వరకు సభ నుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో.. మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకొని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. తాజాగా దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇదిలాఉంటే.. రామ్‌లీలా మైదానంలో గురువారం వేల మంది ప్రజల సమక్షంలో ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఎన్డీయే నేతలు, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. భాజపా పాలిస్తున్న 14 రాష్ట్రాల్లో ఎక్కడా మహిళా ముఖ్యమంత్రి లేకపోవడంతో పార్టీ అధిష్ఠానం రేఖాగుప్తా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

## నదికి మహర్దశ...

న్యూఢిల్లీ,నదులను దేవతలుగా కొలిచే మన దేశంలో జీవనదులు మురికి కూపాలుగా మారుతున్నాయి. ఇలాంటి సెంటిమెంట్లు ఏవీ లేని యూరప్, అమెరికా వంటి పశ్చిమ దేశాల్లో నదులను అత్యంత శుభ్రంగా కాపాడుకుంటున్నారు. ఆ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మన దేశంలోనూ అందిపుచ్చుకుని నదులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నదీమతల్లులకు ప్రతిరోజూ హారతి ఇస్తున్న దేశంలో.. నదీ జన్మస్థానం నుంచి సముద్రంలో కలిసే వరకు అడుగడుగునా దేవతగానే భావించాలి. అప్పుడే నదిని కలుషితం చేయకూడదన్న భావన ప్రతి ఒక్కరిలోనూ కలుగుతుంది. ఒకసారి నదిని శుభ్రంగా కాపాడుకోగల్గితే.. ఆ తర్వాత సుందరీకరణ పనులు కూడా చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. యమునా నదిలో కాలుష్యం స్థాయులు నానాటికీ పెరిగిపోయింది. చర్ పూజ, మౌని అమావాస్య వంటి పర్వదినాల్లో నదీ స్నానాలు చేసే ఉత్తరాదివాసులకు మురికి కాలువను తలపించేలా మారిన యమునా నది ఒక శాపంగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న కమలదళం, ఎన్నికల్లో ఈ అంశాన్ని విస్తృతంగా ప్రస్తావించి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యమునా నది శుద్ధి పనులు చేపడతామని ప్రకటించింది. ఈ నెల 16 నుంచే యమునా నది శుద్ధి పనులను ప్రారంభించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాంశంగా మారిన యమునా నది శుద్ధి పనులు ప్రభుత్వం ఏర్పాటు కంటే ముందు నుంచే ప్రారంభమయ్యాయి. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ యమునా నది శుద్ధి చేస్తామంటూ హామీ ఇచ్చింది. 2020లో ఆమ్ ఆద్మీ పార్టీఈ హామీ ఇచ్చినప్పటికీ.. ఐదేళ్లలో అమలు చేయలేకపోయింది. ఈ నెల 20న కొత్త ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈలోగా ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నారు. యమునా నది ఉత్తరాఖండ్‌లో హిమాలయాలను వీడిన తర్వాత హర్యానా, యూపీ సరిహద్దుల మీదుగా ప్రవహించి ఢిల్లీ నగరాన్ని చేరుకుంటుంది. ఇక్కడి వరకు సాగించే ప్రయాణంలో నది పెద్దగా ఎక్కడా కలుషితం కావడం లేదు. కానీ ఎప్పుడైతే ఢిల్లీలోకి ప్రవేశిస్తుందో.. అక్కణ్నుంచే నదికి కష్టాలన్నీ మొదలవుతున్నాయి. 3 కోట్లకు పైగా జనాభా నివసిస్తున్న ఢిల్లీ–నేషనల్ క్యాపిటల్ రీజయన్ నుంచి అనునిత్యం మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి నదిలో కలుస్తున్నాయి. ఢిల్లీని దాటిన తర్వాత మథుర, ఆగ్రా నగరాల నుంచి కూడా

# సౌర విద్యుత్ పెరిగితేనే సమస్యకు పరిష్కారం !



హైదరాబాద్,మార్చి రాకముందే రాష్ట్రంలో ఎండలు దంచికొడ్తున్నాయి. ఇటు గృహవినియోగంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఎండాకాలం క రెంట్ వినియోగం పెరగగలదని అంచనాలు ఉన్నాయి. అయితే డిమాండ్‌కు తగ్గట్లుగా ఉత్పత్తి సామర్థ్యం ఇంకా పెరగలేదు. రెండు రాష్ట్రాల్లోనూ పవర్ ప్రాజెక్టులు అందుబాటులోకి రావాల్సి ఉంది. పిఎం సూర్య ఘర్ యోజనకింద ఇప్పుడిప్పుడే ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్ కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ప్రోత్సహిస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు, ఉత్పత్తి పెరిగి, గ్రామాలకు రక్షగా ఉంటుంది. అయితే ఈ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన రావాల్సి ఉంది. అలాగే పెద్దపెద్ద కమ్యూనిటీలు సౌర విద్యుత్ ఫలకాలు వాడకాన్ని తప్పనిసరి చేయాల్సి ఉంది. అలాగే ఉచిత విద్యుత్ కారణంగా వ్యవసాయ విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోంది. వ్యవసాయ విద్యుతు÷–÷–పై అజమాయిషీ, ఆడిట్ లేకపోవడంతో అక్కడ ఎంత ఖర్చు చేస్తున్నారన్న దానికి సమాధానం లేదు. ఎపిలో స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ వినియోగం అంచనా వేయాలన్న ప్రయత్నాలపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన వెనక్కి పోయింది. ఇకపోతే వ్యవసాయ విద్యుత్ ఇతర రంగాలకు వినియోగి స్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరికి ఎంత పొలం ఉంది..ఏయే పంటలు పండిస్తున్నారన్న ఆడిట్ కూడా జరగడం లేదు. పంటలకు అనుగుణంగా విద్యుత్ వాడకం ఎంత జరిగిందన్న దానికి లెక్కలు లేవు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే సమస్య ఉంది. ఇకపోతే ఇప్పటికే వరుసగా కోతలు అవస్థలు పెడుతున్నాయి. అప్రకటిత కరెంట్ కోతలు చికాకు కలిగిస్తున్నాయి. తెలంగాణలో అప్రకటిత కోతలు నడుస్తున్నాయి. ఎప్పుడు సడన్‌గా కరెంట్ పోతుందో తెలియడం లేదు. కరెంట్ వినియోగంలో ముందున్న తెలంగాణ రాష్ట్రం.. ఉత్పత్తిలో మాత్రం వెనుకబడిపోయింది. దీంతో బయట ఎక్కువ రేటు పెట్టి కరెంట్ కొనాల్సిన పరిస్థితి నెలకొంది. గత పదేండ్లలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతిరోజు సగటున 300 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం పడుతుండగా, అందులో మన దగ్గర ఉత్పత్తి అయ్యేది115 మిలియన్ యూనిట్లు మాత్రమేనని తెలుస్తోంది. మిగిలిన 185 మిలియన్ యూనిట్లు అంటే 60 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలు, పవర్ ఎక్ఛేంజ్‌ల నుంచి కొనాల్సి వస్తున్నది. విద్యుత్ డిమాండ్ పెద్దగా లేని సమయాల్లో యూనిట్‌కు రూ.2.50 రేటుతో కరెంట్ దొరుకుతున్నప్పటికీ.. డిమాండ్ పీక్స్‌కు చేరే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో యూనిట్‌కు రూ.10 నుంచి రూ.20 దాకా పెట్టి కొనాల్సి వస్తున్నది. దీని వల్ల ఈ మూడు నెలల కాలంలో మన విద్యుత్ పంపిణీ సంస్థలపై, తద్వారా రాష్ట్రంపై రూ.3వేల కోట్లకుపైగా అదనపు భారం పడనుంది. గతేడాది మార్చి 8న అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్?నమోదు కాగా, ఈసారి ఫిబ్రవరి10వ తేదీనే 15,998 మెగావాట్ల డిమాండ్ తో గత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఈసారి యాసంగి సాగు విపరీతంగా పెరగడంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్ 17వేల మెగావాట్లకు చేరుకుంటుందని విద్యుత్ శాఖ అంచనా వేస్తున్నది. కొద్ది రోజులుగా రాష్ట్రంలో 300 మిలియన్‌యూనిట్ల దాకా వినియోగం జరుగుతుండగా, అందులో మన దగ్గర ఉత్పత్తి అయ్యేది కేవలం 115 మిలియన్ యూనిట్లు మాత్రమే. తెలంగాణ జెన్‌కో విద్యుత్‌కేంద్రాల నుంచి 82ఎంయూలు, సింగరేణి నుంచి 27ఎంయూలు, హైడల్ ద్వారా8 ఎంయూలకు అటు ఇటుగా ఉత్పత్తి జరుగుతున్నది. దీంతో సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ సహా వివిధ పవర్ ఎక్ఛేంజీల నుంచి సుమారు 185 ఎంయూల దాకా కొనాల్సి వస్తున్నది. తెలంగాణ ఏర్పడే నాటికి జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 5,405 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 7,285 మెగావాట్లకు చేరింది. అంటే గడిచిన పదేండ్లలో జెన్‌కో సామర్థ్యం కేవలం 1,880 మెగావాట్లు మాత్రమే పెరిగింది. తెలంగాణ వచ్చాక 1,080 మెగావాట్ల కెపాసిటీతో భద్రాద్రి థర్మల్ ప్లాంట్, 4వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి పవర్ ఎ÷–లాంట్ల నిర్మాణాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. వీటిలో ప్రస్తుతం భద్రాద్రిలోని1,080 మెగావాట్ల థర్మల్ ప్లాంట్?తో పాటు యాదాద్రిలోని 5 యూనిట్లలో 800 మెగావాట్ల ఒక యూనిట్ మాత్రమే పూర్తయింది. దీంతో కొత్తగా కేవలం1,880 మెగావాట్ల పవర్ అందుబాటు లోకి వచ్చింది.ప్రస్తుతం జెన్‌కో సామర్థ్యం 7,285 మెగావాట్లు కాగా.. డిమాండ్ మాత్రం 15వేల మెగావాట్లను దాటుతుండడంతో బయట కొనుగోలు చేయక తప్పడం లేదు. గత డిసెంబర్, జనవరి నెలల్లో ఒక్కో యూనిట్‌కు సరాసరి రూ.2.69 నుంచి రూ.2.89 మధ్య పవర్ ఎక్ఛేంజీల నుంచి టీజీ ట్రాన్స్‌కో కరెంట్ కొనుగోలు చేసింది. ఇలా డిమాండ్ పెద్దగా లేనప్పుడు యూనిట్‌కు సగటున రూ.2.50కు దొరికే కరెంట్.. డిమాండ్ ఎక్కువగా ఉండే రాబోయే మూడు నెలల్లో యూనిట్ రేటు రూ.10 నుంచి రూ.20 దాకా చేరవచ్చని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజ్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో అమ్ముతున్న కరెంట్‌లో 90 శాతానికి పైగా తెలంగాణే కొంటున్నది. ఎండాకాలం మొదలై మిగతా రాష్ట్రాలు కూడా పోటీ పడితే పవర్‌ఎక్ఛేంజీలో ధరలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఆయా నెలల్లో విద్యుత్ కొనుగోళ్లపై ఏకంగా ప్రతినెలా రూ.వెయ్యి కోట్ల చొప్పున రూ.3వేల కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో సౌర విదయుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తితో గ్రీన్ ఎనర్జీకి అవకాశాలు ఉన్నాయి. ఇటీవల ఎపి సిఎం చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టారు. దీనిని పెంచుకోగలిగితే విద్యుత్ రంగం స్వయం సమృద్ధి సాధించగలదు.

# గీత కార్మికుల బతుకులకు ఏదీ భరోసా?



హైదరాబాద్,త్రేతాయుగం నుండి దేవతలు సైతం కల్లును సురాపానకంగా స్వీకరించి ఆనందాన్ని వ్యక్తీకరించి తన్మయత్వాన్ని పొందేవారు. సమాజంలో ప్రతి రంగంలో రోజురోజుకి ఎన్నో మార్పులు చోటుచేసుకుని నవశకానికి నాంది పలుకుతుంటే ఒక్క గీత కార్మికుల బతుకుల్లో మాత్రం మార్పు లేకపోవడం బాధాకరం. పాలకులు, ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల జీవన విధానంలో విలక్షణమైన మార్పులు రావడం లేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకు పోరాటమే భవితగా ముందుకు సాగుతున్న ఈ జాతికి భరోసా ఇచ్చేవారెవరు? కుటుంబ బాధ్యతలే పరమావధిగా బాధలు ఎన్ని ఉన్నా భరిస్తూ కులవృత్తిని నమ్ముకున్న ఈ కష్టజీవులను ఆదరించే దిక్కెవరు? తరాలు మారుతున్నా గీతకార్మికుల తలరాతలు మారడం లేదనడానికి ఎన్నో సంఘటనలు మన ముందు కదలాడుతున్నాయి.రెక్కాడితేగానీ డొక్కాడని వీరి జీవితాలు ప్రతిక్షణం కత్తిమీద సాము లాంటివి. ఆత్మగౌరవం తోడుగా ధైర్యమే దోస్తీగా కులవృత్తి జీవన భృతిగా సాగుతున్న వీరి బతుకులకు రక్షణ కరువైందని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలో స్వార్థపూరిత ఆలోచనలతో, అవసరానికి వాడుకునే ఆటబొమ్మల మాదిరిగా చూస్తూ గీత కార్మికుల ఓట్ల కోసం పాకులాడే పాలకులు తప్ప గౌడన్నల సంక్షేమానికి దారి చూపేవారు కానరారు. జిఒల పేర్లతో, సర్క్యులర్ల సాకుతో కాలక్రమంగా గీత వృత్తి ఉనికిని దూరం చేస్తున్నారే తప్ప వృత్తి పరిరక్షణకు, ఉపాధి కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు అనడంలో సందేహం లేదని చెప్పవచ్చు. అధికారుల, పాలకుల అండతో అగ్రవర్ణాల ఆగడాలతో అమాయకపు గీతకార్మికుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే నాథుడే లేడు. వివిధ కార్యక్రమాల పేర్లతో వృత్తి పరిరక్షణ ప్రచారం పేరుతో తాటి, ఈత వనాలు పెంచుతామని చెప్తూనే, వాటి పర్యవేక్షణ బాధ్యతను గాలికి వదిలేసి గీత కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యపు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. పంట భూముల్లో ఉన్న తాటి, ఈత చెట్లను కొంత రుసుం చెల్లించి తొలగించుకోవచ్చనే నిబంధన గౌడన్న జీవనోపాధికి బీటలు పారేలా చేస్తుంది.ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడి దుర్మరణం చెందిన గీతకార్మికుల ఎక్స్‌గ్రేషియా మంజూరు విషయంలో కూడా నిమ్మకునీరెత్తినట్లు ఉండటమే చేస్తుంది. సంవత్సరాలు గడుస్తున్నా కుటుంబంలో ఎవరి తోడులేక, బాధ్యతాయుమైన వ్యక్తిలేక ఎంతోమంది గీత కార్మికుల కుటుంబాలకు ఇప్పటి వరకు కూడా ఎక్స్‌గ్రేషియా రాకపోవడం దురదృష్టకరం. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ఈత, తాటివనాలకు రక్షణ దిక్కులేదు కానీ కొత్తవనాల పెంపు కార్యక్రమాలు రూపొందించడం హాస్యాస్పదం అని చెప్పవచ్చు. దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తే ఇప్పటివరకు బాధిత గీతకార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన పాపానపోలేదు. నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతూ నిరుపేద గౌడన్నల జీవితాలు అగమ్యగోచరంగా మారినా ప్రభుత్వాల మనసు మాత్రం మారడంలేదు. బడుగు బలహీన వర్గాల్లో అధిక జనాభా కలిగిన గీత కార్మికుల సంక్షేమానికి ఒక ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించి గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. గీత కార్మికుల కుటుంబంలో ఉన్న యువతకు ఉపాధి కల్పన కోసం తాడి టాపర్ బోర్డు ఏర్పాటుచేసి తాటి ఈత సంబంధిత పదార్థాల ఉత్పత్తిని చేపట్టాలి. ప్రకృతి సిద్ధంగా, సహజంగా లభించే కల్లును మార్కెట్లో అందుబాటులో ఉంచి వాణిజ్య పరిశ్రమగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి.తాటి ఈత ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి గీత కార్మికుల జీవనోపాధికి పటిష్ఠమైన కార్యక్రమాలు, పథకాలు రూపొందించాలి. వృద్ధులైన గీత కార్మికులకు తగిన మొత్తంలో పింఛన్లు ఇవ్వాలి. తాటి ఈతవనాల పెంపకానికి సంబంధించి మరుగుజ్జు రకానికి చెందిన రకాలపై దృష్టి సారించాలి. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై పడి మరణించే పరిస్థితిని రూపుమాపడానికి నిర్ణయాత్మక ఆలోచనతో తాడిచెట్టు ఎక్కే యంత్రాలను ప్రభుత్వం తీసుకురావడం జరిగింది కానీ వాటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర మొత్తంలో ఉన్న గీత కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు సేఫ్టీ మోకులను అందించేలా ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకమైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టివిఎస్ మోపెడ్లు కొనుగోలు చేసి ఇవ్వాలి. కుటుంబాలు గడవడం కష్టంగా మారి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న, ఎండిన తాటి, ఈత వనాలతో కల్లు రాక నానా ఇబ్బందులుపడుతున్న గీత కార్మికులకు గౌడ స్వయం ఉపాధి సంఘాలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించాలి. బెల్టు షాపుల దెబ్బకు కల్లు అమ్ముడుపోక ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న పరిస్థితులను పాలకులు ఆలోచన చేయాలి. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గీత కార్మికుల సంక్షేమానికై ఒక్క నూతన పథకం కూడా అమలు చేయడం లేదని గౌడన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నా, గీత కార్మికులు చస్తే తప్ప బతకడానికి పథకాలు ఏమీ లేవు. తాటి చెట్లు ఎక్కి కల్లు గీసుకునే గీత కార్మికులు ప్రమాదవశాత్తు పడి మరణిస్తే, శాశ్వత అంగ వైకల్యం పొందిన వారికి ప్రభుత్వం రూ. 5 లక్షల బీమా నుండి 10 లక్షల వరకు వర్తింపజేయాలి. గీత వృత్తిని అభివృద్ధి చేసేందుకు సబ్సిడీ పథకాలు రూపొందించడంలో ప్రభుత్వం గౌడ కులస్థులను విస్మరించే పరిస్థితి మారాలి. మొదటి నుంచి గౌడ జాతిపై చిన్నచూపుతో ప్రభుత్వం గీత కార్మికులపై వివక్ష చూపుతుంది. ఇప్పటికైనా పాలకులు గౌడన్న బతుకులకు భరోసా ఇచ్చే కార్యక్రమాలు రూపొందించాలి.

### మక్తల్ ఎమ్మెల్యేపై సీఎం రేవంత్‌కు ఫిర్యాదు

మహబూబ్‌నగర్, మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై ఆ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరగబడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అవినీతి చేశాడంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మక్తల్ కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగా లేఖ రాశారు. ఎన్నికలకు ముందు డబ్బులు లేవని అప్పులు తీసుకున్న వాకిటి శ్రీహరి ఇప్పుడు తన ఇంటి పక్కనున్న మరో ఇల్లును కోటి 50 లక్షలు పెట్టి ఎలా కొన్నాడు? అని ప్రశ్నించారు. అలాగే లహరి కన్వేషన్ పక్కన 100 గజాల స్థలం, హైదరాబాద్‌లో 5 ప్లాట్లు, భూత్పూర్ దగ్గర 10 ఎకరాల భూమి, కుటుంబసభ్యులు తిరగడానికి 5 కార్లు ఎలా వచ్చాయి? అని నిలదీశారు. వైన్ షాపులో పని చేసే నాగరాజు అనే వ్యక్తి వాకిటి శ్రీహరి గెలిచాక కోట్ల రూపాయలకు ఎలా పడగెత్తినాడు? వాకిటి శ్రీహరి అనుచరులు కల్లు మామ్లు చేసుకునే గౌడ కులస్తులతో మామూళ్లు ఎందుకు వసూలు చేస్తున్నారు? వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తే మక్తల్ మొత్తం నాశనం

## వందశాతం పంచాయితీ పన్నుల వసూలు లక్ష్యం

కామారెడ్డి,కామారెడ్డి జిల్లాలో 100 శాతం ఇంటి పన్నుల వసూళ్లపై యంత్రాంగం దృష్టి సారించింది. నిధులు లేక పంచాయితీలు నీరసించడంతో పాటు, అభివృద్ధి ఆగిపోయింది. జిల్లాలో కచ్చితంగా వందశాతం ఇంటి పన్నులు , ఇతర పన్నులను వసూళ్లు చేస్తాం అని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. ఇప్పటికే 74 శాతం దాటింది. మిగతా 26 శాతాన్ని మార్చి చివరి వరకు పూర్తి చేస్తామన్నారు. మార్చి మొదటి వారం వరకు పన్నుల వసూళ్లపై సమీక్షించి ఎక్కువగా బకాయిలు ఉన్న పంచాయతీల్లో స్పెషల్ టీమ్స్‌ద్వారా పూర్తి స్థాయిలో కలెక్షన్ చేయిస్తామని అన్నారు. పన్నులు పూర్తి స్థాయిలో కలెక్షన్‌అయితే గ్రామాల్లో పనులు చేపట్టానికి వీలుంటుందని వివరించారు.ఇంటి పన్నులు ద్యూ ఉంటే వారి చేత కట్టిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 31కి ఆర్థిక సంవత్సరం ముగింపు ఉన్న దృష్ట్యా అప్పటి లోగా100 శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎక్కువగా ఇంటి పన్నులు చెల్లించని గ్రామాలు, మండలాలను గుర్తించి అవసరమైతే స్పెషల్? టీమ్స్? ఏర్పాటు చేయనున్నారు. మార్చి 2వ వారం వరకు అధిక మొత్తంలో కలెక్షన్లు ఉన్న చోట మండల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీవోలు టీమ్‌గా వెళ్లి కలెక్షన్ చేస్తారు. పన్నులు చెల్లించటం ద్వారానే గ్రామాల్లో వీధి దీపాలు (స్ట్రీట్? లైట్లు) శానిటేషన్‌ను సక్రమంగా చేపట్టడానికి వీలుంటుందని ప్రజలకు తెలియజేస్తూ పూర్తిస్థాయిలో పన్నులు చేయటానికి కార్యాచరణ రెడీ చేస్తున్నారు. జిల్లాలో 535 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక ఏడాదిలో ఇంటి పన్నులు చెల్లించాల్సింది రూ. 7.97 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ. 6. 17 లక్షలు మాత్రమే వసూల్ అయ్యాయి. నాన్ ట్యాక్స్‌ల కింద రూ. 2.71 కోట్లకు రూ. 2 కోట్లు వచ్చాయి. ఇంటి పన్నులు, ఇతర ట్యాక్స్‌లు కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ. 8 .19 కోట్లు కలెక్ట్ అయ్యాయి. ఆర్థిక ఏడాది మరో 45 రోజులే మిగిలి ఉండటంతో మిగతా ట్యాక్స్ వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే స్పెషల్‌టీమ్స్‌ఏర్పాటు చేసి 100 శాతం పన్నులు వసూళ్లు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్ కార్మికుల జీతాలు, ఇతర స్టాఫ్? జీతాలు, బ్లీచింగ్, ఆఫీసు నిర్వహణ, బోర్ మోటార్ల నిర్వహణ ఇంటి పన్నులపై ఆధారపడి ఉంటాయి. ఇంటి పన్నులు, నీటి కుళాయి బిల్లులు, నాన్ ట్యాక్స్‌ల లాంటి పన్నుల ద్వారానే పంచాయతీకి ఆదాయం వస్తుంటుంది. ఈ పన్నులు పూర్తి స్థాయిలో కలెక్షన్ అయితేనే స్థానికంగా ఇబ్బందులు లేకుండా పాలన అందించటానికి వీలుంటుంది. పంచాయతీల్లో వసూళ్లు అయ్యే వివిధ రకాల పన్నులపై ఎప్పటికప్పుడు సంబంధిత బ్యాంక్ అకౌంట్లలో జమ చేసి ట్రెజరీ ద్వారా ఖర్చు చేస్తున్నారు. గతంలో ఏండ్ల తరబడి ఇంటి పన్నులు బకాయిలు ఉండేవి. కానీ పంచాయతీలకు సెక్రటరీల నియామకం తర్వాత అన్ని పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూళ్లు చేయాలని జిల్లా అధికారులు లక్ష్యంగా పెట్టారు. ప్రతినెలా మండలాల వారీగా పన్నుల వసూళ్లపై రివ్యూ చేస్తున్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు పంచాయతీ నుంచి జారీ చేసేటప్పుడు సంబంధిత ఇంటి యజమాని పన్నులు పెండింగ్ లో లేకుండా చూస్తున్నారు.

## ద్వారంపూడిలో అతిపెద్ద ఆదియోగి విగ్రహం

రాజమండ్రి, తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద ఆదియోగి విగ్రహం ఏర్పాటయ్యింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో ఈ విగ్రహాన్ని ఆంధ్రా శబరిమలగా ప్రసిద్ధిగాంచిన ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మించారు. మహాశివరాత్రి పర్వదినం రోజున ఈ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఈసా యోగా కేంద్రంలో ఉన్న ఆదియోగి విగ్రహ నమూనా ఆధారంగా అచ్చం అలాంటి విగ్రహాన్నే ద్వారపూడిలో ఏర్పాటు చేశారు. కోయంబత్తూరులో ఉన్న విగ్రహం 112 అడుగుల ఎత్తు, 82 అడుగుల వెడల్పులో ఉంటుంది. అదే నమూనాను బిక్కవోలు మండలం కొమరిపాలెం కు చెందిన శిల్పి పెద్ద రాఘవ బృందం పదినెలలు పాటు శ్రమించి ఈ విగ్రహాన్ని రూపొందించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో పూర్తిగా సిమెంట్ తో ఈ విగ్రహాన్ని నిర్మించినట్లు ఆలయ గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు తెలిపారు. ఇప్పటికే ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అరుదైన శివాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు పదుల సంఖ్యలో ఆలయాలు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు ఈ ఆదియోగి విగ్రహం ద్వారా ఈ ఆలయానికి మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండపేట మండలానికి చెందిన ఈ ద్వారపూడి.. రాజమహేంద్రవరం నుంచి 20 కిలోమీటర్లు, అనపర్తికి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో సామర్లకోట కెనాల్ రోడ్ ను ఆనుకుని ఈ ఆలయం ఉంటుంది.

## హర్యానాతో లింకేంటి?

న్యూఢిల్లీ: రేఖా గుప్తాను ఢిల్లీ ముఖ్యమంత్రిగా బీజేపీ ఎంపిక చేసింది. ఆమె హర్యానాలోని జింద్‌లోగల నంద్‌గర్ గ్రామానికి చెందినవారు. రేఖా గుప్తాకు ముందు ఢిల్లీకి సీఎంలుగా పనిచేసిన సుష్మా స్వరాజ్, కేజ్రీవాల్ కూడా హర్యానాకు చెందినవారే కావడం విశేషం. ఈ ముగ్గురికీ హర్యానాతో ఉన్న సంబంధం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.రేఖా గుప్తా తాత మణిరామ్ కుటుంబం నందఘర్‌లో ఉండేది. రేఖా గుప్తా తండ్రి జై భగవాన్ బ్యాంక్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన సమయంలో వారి కుటుంబం ఢిల్లీకి చేరుకుంది. రేఖా గుప్తా కంటే ముందు ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా హర్యానాకు చెందినవారే. అలాగే బీజేపీ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సుష్మా స్వరాజ్ కూడా హర్యానాతో సంబంధం కలిగివున్నారు.

రేఖా గుప్తా

రేఖ గుప్తా 1974, జూలై 19న జన్మించారు. రేఖ తన విద్యార్థి దశ నుండే రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. రేఖ గతంలో రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. మొదటిసారి ఆమె 11,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. తరువాత ఆమె ఆప్ అభ్యర్థి వందన చేతిలో 4,500 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈసారి ఆమె వందనను భారీ ఓట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ స్థానం నుండి పోటీకి దిగిన ఆప్ అభ్యర్థి వందనకు 38605 ఓట్లు రాగా, రేఖా గుప్తాకు 68200 ఓట్లు వచ్చాయి.

అరవింద్ కేజ్రీవాల్

అరవింద్ కేజ్రీవాల్ 1968లో హర్యానాలోని హిసార్‌లో జన్మించారు. 1991లో ఐఐటీ ఖరగ్‌పూర్ నుండి ఇంజనీరింగ్ పూర్తిచేశారు. 1992లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లోని ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు ఎంపికయ్యారు. కేజ్రీవాల్ తొలుత ఢిల్లీలోని ఆదాయపు పన్ను కమిషనర్ కార్యాలయంలో నియమితులయ్యారు. ఆయన 2006 లో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి, అరుణా రాయ్ వంటి ఇతర సహోద్యోగులతో కలిసి సమాచార హక్కు చట్టం కోసం ప్రచారాన్ని ప్రారంభించారు.

సుష్మా స్వరాజ్

సుష్మా స్వరాజ్ 1952 ఫిబ్రవరి 14న హర్యానాలోని అంబాలాలో జన్మించారు.

శనివారం 22-02-2025 అగ్రనేత తెలుగు దినపత్రిక RNI No : TELTEL/2015/66279 


# ఇకనైనా.. ఢిల్లీ రాజకీయం మారేనా?



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు అందరికీ తెలిసిందే. ఇక్కడ ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు ఎన్నుకు న్న ప్రభుత్వం ఏర్పడినా.. మాయల ఫకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్టుగా.. దాదాపు ప్రధాన అధికారాలు అన్నీ కూడా కేంద్రం చేతిలో ఉంటాయి. ఇతర రాష్ట్రాలకు లేని విధంగా ఇక్కడ కేంద్రం అజమాయిషీ కనిపిస్తుంది. అంతేకాదు.. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్నికట్టడి చేసేందుకు.. మోడీ సర్కారు తెచ్చిన మరో చట్టం కూడా.. ఢిల్లీ పాలకులకు శాపంగా మారింది.ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే చిన్నస్థాయి ప్యూన్‌ను సైతం బదిలీ చేసే అధికారం లేకుండా.. కేంద్రం కొత్త చట్టం ద్వారా అధికారం బదలాయించుకుంది. ఇక, ఇప్పటికే ఉన్న చట్టాల ప్రకారం.. పోలీసులు, శాంతి భద్రతలు, ఎక్సైజ్, వంటి కీలక శాఖలు.. కేంద్రం పరిధిలోనే ఉంటాయి. అయితే.. రెవెన్యూ మాత్ర మే రాష్ట్ర సర్కారు పరిధిలో ఉన్నా.. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఈ పరిణామాలే.. ఆప్ ప్రభుత్వానికి చేతులు కాళ్లు ఆడకుండా చేశాయి.ఇక, ఇప్పుడు బీజేపీ సర్కారే పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ పాలకులు సహకరించడం ఖాయమే. ఎందుకంటే.. రెండు కూడా డబుల్ ఇంజన్ సర్కారే కాబట్టి.. సహకారంపై ఎలాంటి సందేహం లేదు. కానీ, ఇక్కడే మరో కీలక విషయం ఉంది. ఆప్‌పై కోపంతో తెచ్చిన నూతన అధికారాల చట్టం విషయాన్ని ఏం చేస్తారన్నది ప్రశ్న. ప్రతి దానికీ కేంద్రాన్ని సంప్రదించాల్సిన అవసరం కల్పించిన ఈ చట్టం .. అలానే కొనసాగుతుందని కొందరు చెబుతుంటే.. కాదు మార్పు చేస్తారని మరికొందరు అంటున్నారు.ఇక, పోలీసుల నియంత్రణ, శాంతి భద్రతలు వంటి అధికారాలను రాష్ట్ర సర్కారుకు తాత్కాలికంగా అయినా.. బదిలీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక, గత పాలకులపై కేసుల విచారణ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు వంటివి రాష్ట్ర సర్కారే చూసే అవకాశం ఉందని సమాచారం. తాజాగా సీఎంగా ప్రమాణ స్వీకారానికి ముందు రేఖా గుప్తా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. మార్చి నుంచి వాటిని పట్టాలెక్కిస్తామని కూడా ఆమె చెప్పుకొచ్చారు. ఈ పరిణామాలను గమనిస్తే.. రాష్ట్ర ఢిల్లీకి- కేంద్ర ఢిల్లీకి మధ్య గ్యాప్ తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అందరిలో ఆయనే సనాతని !

అమరావతి,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టినపుడు ఆయన ఎక్కువగా వామపక్ష భావజాలాన్ని ప్రవచించారు. ఆయన హైదరాబాద్ లో ఇచ్చిన తొలి స్పీచ్ లో ఎక్కువగా అభ్యుదయ వాదాన్ని వినిపించారు. ఆ తర్వాత కూడా ఆయన తరచూ ప్రపంచ వామపక్ష నేతలను కొనియాడుతూ వచ్చారు. అయితే 2014 ఎన్నికల వేళ పవన్ బీజేపీకి టీడీపీకి మద్దతు ఇచ్చారు.ఆ తరువాత మూడేళ్ళకు బీజేపీ నుంచి విడిపోయినపుడు వామపక్షాలతో పొత్తు పెట్టుకున్నారు. మాయావతితోనూ స్నేహం కలిపారు. ఆ విధంగా 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఫలితం తేడా కొట్టగానే మళ్ళీ బీజేపీతో పొత్తుకు సిద్ధపడ్డారు. ఇలా కేవలం తొలి అయిదేళ్ళ కాలంలోనే ఆయన రైటిస్ట్ లెఫ్టిస్టు భావజాలాల మధ్య తన పార్టీని తిప్పారు అన్న ప్రచారం ఉంది.ఇక 2020 జనవరిలో బీజేపీతో మళ్ళీ పొత్తు పెట్టుకున్నా ఈ రోజు వరకూ దానిని కొనసాగిస్తున్నారు. ఇక చూస్తే 2024 ఎన్నికల తరువాత బీజేపీ భావజాలాన్ని పూర్తిగా తనలో ఆవహింప చేసుకుని పవన్ మరింతగా ముందుకు వెళ్తున్నారు అన్న చర్చ సాగుతోంది. ఆయన బీజేపీ వారి కంటే కూడా ఎక్కువగా హిందూత్వ విషయంలో స్పందిస్తున్నారు తిరుపతి లడ్డు ఇష్యూలో ఆయనే చాలా ప్రకటనలు చేశారు.పది రోజుల పాటు దీక్షలు చేశారు వారాహి సభ పెట్టి మరీ దేశంలో బీజేపీ సహా ఏ రాజకీయ పార్టీ కోరని విధంగా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆ విధంగా జాతీయ స్థాయిలో పవన్ ఆకర్షించబడ్డారు. ఇక పవన్ ఇటీవల మహా కుంభమేళాలో పవిత్ర స్నానాలకు వెళ్ళినపుడు మీడియాతో మాట్లాడుతూ హిందూత్వ కు అనుకూలంగా వ్యాఖ్యలు చేసారు. మమతా బెనర్జీ వంటి వారు మృత్యు కుంభ్ అంటూ చేసిన కామెంట్స్ ని తిప్పికొట్టారు.ఇక ఢిల్లీలో చూస్తే అక్కడ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం వేదిక మీద నుదుటిన పొడవాటి నామంతో సనాతన దుస్తులతో పవన్ ప్రత్యేకంగా కనిపించారు. ఆయనకు అటూ ఇటూ కూర్చున్న బీజేపీ నేతలు ఎవరూ కూడా సనాతన వస్త్రధారణతో కనిపించలేదు. ఆ విధంగా కాషాయం నేతల కంటే మిన్నగా పవన్ కనిపించారు.బహుశా దీనిని చూసిన మీదటనే ప్రధాని నరేంద్ర మోడీ పవన్ ని చూసి హిమాలయాలకు వెళ్తావా అని జోక్ చేశారు అని అంటున్నారు. బీజేపీ హిందూత్వ గురించి డెబ్బై ఏళ్ళుగా పోరాడుతోంది. ఇక ఆరెస్సెస్ వందల ఏళ్ళుగా హిందూత్వ భావ జాలాన్ని జనాల్లోకి తీసుకెళ్తోంది.



అయితే వారిలో ఎవరూ సనాతనిగా కనిపించేందుకు ప్రయత్నాలు కనీసంగా చేయరని అంటున్నారు. వారిది అంతా ఆచరణే అని చెబుతారు.హిందూత్వ విషయంలో బీజేపీకి ఉన్న సంకల్పం కానీ పట్టు కానీ ఎవరికీ లేవని గట్టిగా చెప్పవచ్చు. అయితే బీజేపీ తర్వాత ఆ స్థాయిలో హిందూత్వ మీద గర్జించిన పార్టీ శివసేన. ఇపుడు ఆ పార్టీ కూడా ఇండియా కూటమిలో చేరింది. దాంతో జనసేన దేశంలోనే ఏకైక పార్టీగా ఈ విషయంలో ఉంది అని అంటున్నారు.పవన్ సనాతన ధర్మం పట్ల అనురక్తిని పెంచుకుని దేశంలో బలంగా ఉండాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో ఆయన నిబద్ధత కూడా ఎవరూ శంకించాల్సిన అవసరం లేదు. కానీ గతంలో ఆయన లెఫ్టిస్టు భావజాలానికి ఎందుకు ఆకర్షించబడ్డారు, ఇపుడు ఎందుకు సనాతనిగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు అన్న దాని మీద అయితే చర్చ సాగుతూనే ఉంది. అభిప్రాయాలను మార్చుకోవడంలో తప్పు అయితే లేదు. ఈ దేశంలో అత్యధిక శాతం హిందువులు ఉన్నారు. వారి కోసం మాట్లాడేందుకు పార్టీలు అయితే పెద్దగా లేవు ఇపుడు బీజేపీ తరువాత జనసేన ఉంది.బీజేపీకి రాజకీయాలతో కంటే గెలుపు ఓటముల కంటే కూడా హిందూత్వ సిద్ధాంతం మీద సంపూర్ణమైన సంకల్పం ఉంది. జనసేన కూడా అదే బాటన నడిస్తే మాత్రం దేశంలో రైటిస్ట్ ఫిలాసఫీ మరింతగా బలపడుతుంది. మరి పవన్ సనాతనీగా ఈ దేశం కోసం ఎంతదాకా ఎంత బలంగా ముందుకు వెళ్తారన్నది మాత్రం అంతా ఆసక్తిగా చూస్తున్నారు.

# జగన్‌పై ఆదరణా? బాబుపై వ్యతిరేకతా?



అమరావతి,తొమ్మిది నెలల క్రితం వైఎస్ జగన్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. వైసీపీ రాజకీయంగా ఇప్పట్లో కోలుకోలేదని అందరూ అనుకున్నారు. కాలం అనేది శక్తిమంతమైంది. ఊహించని మార్పుల్ని తీసుకొచ్చే శక్తి కాలానికి మాత్రమే వుంటుంది. ఈ నేపథ్యంలో దారుణ పరాజయాన్ని మూటకట్టుకున్న జగన్ తొమ్మిది నెలలు గడిచే సరికే తన వెంట జనాన్ని పరుగు తీసేలా చేసుకున్నారు. తన వెంటపడుతున్న జనాన్ని చూసి జగనే ఆశ్చర్యపోతున్నారని సమాచారం.అయితే ఈ జనాదరణను ఎలా చూడాలనే ప్రశ్న తలెత్తింది. ఇది కేవలం జగన్‌పై అభిమానంగా చూడాలా? లేక సీఎం బాబు ప్రభుత్వంపై వ్యతిరేకతగా పరిగణించాలా? అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కానీ ఒక్కటి మాత్రం నిజం. హామీలపై పిల్లిమొగ్గలు వేస్తూ, ఆర్థిక వ్యవస్థ బాగా లేదనే బాబు కామెంట్స్‌తో తాము మోసపోయామని జనం అసంతృప్తికి లోనయ్యారు. సూపర్‌సిక్స్ పేరుతో జగన్ కంటే రెట్టింపు సంక్షేమ లబ్ధి ఇస్తానని చంద్రబాబు హామీలు ఇవ్వడం వల్లే కదా తాము కూటమిని ఆదరించిందనే భావన ప్రజల్లో వుంది.అయితే ఇప్పట్లో ఎన్నికలు లేకపోవడంతో, వాళ్ల ఆగ్రహాన్ని, అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశం ప్రజల చేతల్లో లేదు. పాలకుల ప్రతి మాటను ప్రజలు జాగ్రత్తగా గమనిస్తుంటారు. మోసపోయామనే భావనను జీర్ణించుకోలేరు. ఇదే సందర్భంలో జగన్ చేసింది నిజాయితీగా చెప్పారు. అలాగే మరోసారి అధికారం ఇస్తే, ఏ మేరకు చేయగలనో దాపరికం లేకుండా వెల్లడించారు. కానీ జగన్ ఎన్నికల సందర్భంలో చెప్పిన నిజాలు, ఇచ్చిన వాగ్దానాలు జనానికి రుచించలేదు. చంద్రబాబు సంపద సృష్టించి, అంతా మీకే పంచుతానని చెప్పడం జనానికి బాగా నచ్చింది. అలాగే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. ఉద్యోగులకు ఏవేవో హామీలు ఇచ్చారు. ఇప్పుడేవీ అమలుకు నోచుకోవడం లేదు. చివరికి మొదటి ఫైల్‌పై బాబు సంతకానికి నోచుకున్న డీఎస్సీ నిర్వహణకే దిక్కు లేకుండా పోయింది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో, అవి పూర్తయిన తర్వాత నిర్వహిస్తామని ప్రకటించారు.రాజకీయాల్లో నాయకులపై ప్రజలకు ప్రత్యేకంగా ఇష్టాయిష్టాలుండవు. ఎవరి వల్ల లాభం లేదా నష్టం అనేవి మాత్రమే చూస్తారు. ఆ కోణంలో చూస్తే జగన్ హయాంలో సామాన్య ప్రజల చేతల్లో డబ్బు తిరగాడేది. ఇప్పుడా పరిస్థితి లేదు. బహుశా అందుకేనేమో జగన్ అంటే నెమ్మదిగా ప్రజల్లో అభిమానం పెరుగుతోంది. ఇది నాణేనికి ఒకవైపు. నాణేనికి రెండో వైపు బాబుపై వ్యతిరేకతగా చూడొచ్చనే అభిప్రాయంపై కూడా లోతుగా ఆలోచించాల్సిన అవసరం వుంది. ఏది ఏమైనా నాయకులపై ప్రజల కోపం శాశ్వతం కాదని జగన్‌కు వస్తున్న ప్రజాదరణే నిదర్శనం.

# రూపాయి విలువ నిలబెట్టే ప్రయత్నంలో ఎల్ఐసీకి 84వేల కోట్లు నష్టం



న్యూఢిల్లీ,గత మూడు నెలలో జరిగిన జాతీయా అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, వాణిజ్య పరిణామాల కారణంగా స్టాక్ మార్కెట్‌లు అతలాకుతలం కావడంతో ఆయా కంపెనీల విలువ పడిపోయింది. దాంతో పాటే ఆయా కంపెనీలలో ఉన్న ఎల్ఐసీ వాటాల విలువ కూడా పడిపోయింది. (లీడ్)బుధవారం రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దారుణంగా పతనమవుతున్న రూపాయి విలువను నిలబెట్టే ప్రయత్నంలో విదేశీ మారకం మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం చేసుకొని డిసెంబర్ 2024లో 15.2 బిలియన్ డాలర్ల విలువైన అమ్మకాలు జరిపింది. గత సంవత్సరం నవంబర్ నెలలో ఈ అమ్మకాలు 20.2 బిలియన్ డాలర్లుగా సాగాయి. అదే నెల అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ వాణిజ్య సుంకాల యుద్ధానికి తెరతీయనున్నట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లు ప్రత్యేకించి స్టాక్ మార్కెట్‌లు అల్లకల్లోలానికి గురయ్యాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ విలువ పెరిగింది.నిరంతరం పతనమవుతున్న రూపాయి విలువను కాపాడే ప్రయత్నంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేరుగా విదేశీ మారకం మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోళ్లకు దిగింది. గత కొన్ని నెలలుగా వివాదాస్పదమైన అమెరికన్ వాణిజ్య సుంకాలు, రాజకీయ భూగోళంలో అనిశ్చితి, పెట్టుబడుల పలాయనం వంటివి రూపాయి పతనానికి ముఖ్యమైన కారణాలుగా ఉన్నాయి. రూపాయి విలువ పతనం ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేస్తుంది. ఐదుశాతం రూపాయి విలువ పతనమైతే ద్రవ్యోల్బణం 30- 35 బేస్ పాయింట్లు పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్ర అంచనా వేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా రాసింది.అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రభావితం చేసే 40 దేశాల కరెన్సీలతో పోల్చి రూపాయి విలువ పతనాన్ని, పెరుగుదలను లెక్కిస్తారు. ఈ క్రమంలో ఆర్‌బీఐ జోక్యం అంటే భారతమార్కెట్‌లో ఆ నలభై దేశాల కరెన్సీలలో జరిగే లావాదేవీలను నియంత్రించడానికి జోక్యం చేసుకోవడమే, కరెన్సీ విలువ తక్కువగా ఉంటే ఎగుమతులు పెరగడానికి అవకాశం ఉంటుంది. అదే సందర్భంలో దిగుమతుల పరిణామం మారకపోయినా దిగుమతుల విలువ పెరిగి, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ మొత్తం లావాదేవీలు స్టాక్ మార్కెట్‌లో ఒక భాగంగా ఉన్న ఈక్విటీ మార్కెట్‌ను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తాయి.ఈక్విటీ మార్కెట్‌లో భారతీయ జీవిత బీమా కంపెనీ ప్రధానమైన మదుపుదారు(ఇన్వెస్టర్). రూపాయి విలువ నిలబెట్టే ప్రయత్నంలో ఆర్‌బీఐ తీసుకున్న చర్యల కారణంగా ఈక్విటీ మార్కెట్ పడిపోయింది. అంటే ఈక్విటీ మార్కెట్‌లో షేర్‌ల విలువ పడిపోయింది. ఫలితంగా ఈక్విటీ మార్కెట్‌లో ప్రధాన మదుపుదారుగా ఉన్న ఎల్ఐసీకి ఒక జనవరి నెలలోనే 84 వేల కోట్ల రూపాయల నష్టం వచ్చింది. 2024 డిసెంబర్ నాటికి వివిధ కంపెనీలలో ఎల్ఐసీ 14.72లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టింది. గత మూడు నెలలో జరిగిన జాతీయ- అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, వాణిజ్య పరిణామాల కారణంగా స్టాక్ మార్కెట్‌లు అతలాకుతలం కావడంతో ఆయా కంపెనీల విలువ పడిపోయింది. దాంతో పాటే ఆయా కంపెనీలలో ఉన్న ఎల్ఐసీ వాటాల విలువ కూడా పడిపోయింది. 2024 డిసెంబర్ నాటికి 14.72 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్న వివిధ కంపెనీలలో ఎల్ఐసీ వాటాల విలువ 2025 ఫిబ్రవరి 18నాటికి 13.87 లక్షల కోట్ల రూపాయలకు పడిపోయింది. అంటే స్టాక్ మార్కెట్ అనిశ్చితి కారణంగా గత రెండు నెలలలో ఎల్ఐసీకి వచ్చిన నష్టం 84వేల కోట్ల రూపాయలు.

# టీపీసీసీ, ఇన్‌ఛార్జ్, సీఎంల జూమ్ మీటింగ్.. నేతలకు కీలక సూచనలు




హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంపై ఫోకస్ చేసింది హైకమాండ్. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంపై దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవడంపై అడుగులు వేస్తోంది. ఆ విధంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఆ దిశగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం వేడెక్కింది. రేసు నుంచి బీఆర్ఎస్ తప్పుకోవడంతో అధికార కాంగ్రెస్-విపక్ష బీజేపీలు నువ్వానేనా అన్నరీతిలో ప్రచారం చేస్తున్నాయి. మూడు సీట్లు గెలుచుకోవాలని ఇరుపార్టీలు ఉవ్విల్లూరుతున్నాయి.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రి పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు హాజరయ్యారు. వీరితోపాటు 42 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ సేవాదల్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు హాజరయ్యారు.

కీలక సమావేశం

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో పకడ్బందీగా ప్రచారం చేయాలన్నారు. 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్ చొప్పున నియమించాలన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు గ్రామ స్థాయి నుంచి వ్యూహాలు రచించాలన్నారు. ఓటర్లకు మన మీద మంచి అభిప్రాయం ఉన్నా వారితో ఓటు వేయించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారం చేపట్టాలన్నారు.మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు ఎన్నికల వ్యూహంతో పని చేయాలన్నారు. మొదటి, రెండో ప్రాధాన్యత ఓటులపై దృష్టిపెట్టాలన్నారు. ఎలిమినేట్ సిస్టమ్ లో ఓట్ల లెక్కింపు ఉన్నందున ప్రతి ఓటును చాలా కీలకంగా తీసుకోవాలన్నారు. ఓటర్ మ్యాపింగ్, ఓటర్లను ప్రత్యేకంగా కలవడం, గ్రామ స్థాయి నుంచి బూత్‌కు తీసుకెళ్లడం లాంటి అంశాలు చాలా కీలకమైన అంశాలు చెప్పారు. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకూడదన్నారు. గాంధీ భవన్ నుంచి కంట్రోల్ రూమ్ పెట్టి నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

మీనాక్షి సలహాలు

ఎమ్మెల్సీ ఎన్నిక చాలా కీలకమైనది,అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్. సిట్టింగ్ ఎమ్మెల్సీ సీటు ఒకటైతే, రాష్ట్రంలో అధికారంలో ఉన్నామని గుర్తు చేశారు. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అవన్నీ ప్రచారంలోకి తీసుకెళ్లి విజయం సాధించేలా చేయాలన్నారు.

ఫ్యూచర్ ప్లాన్

ఈ నెల 23న పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు కానుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో సమావేశం జరగనుంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారు.వీరితోపాటు జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, ఎన్నికల కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్‌ల ఛైర్‌పర్సన్లు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, పీసీసీ అధికార ప్రతినిధులు పాల్గొంటారు. మండల, బ్లాక్ కాంగ్రెస్ మొదలు, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే అంశంపై అందరి అభిప్రాయాలు తీసుకోనున్నారు. హామీలను ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలో ఎందుకు విఫలమవుతున్నామనే విశ్లేషించనున్నారు. మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డిలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

# కాంగ్రెస్ బ్యాచ్ ని శైలజానాథ్ తీసుకొస్తారా ?

అమరావతి,వైసీపీలో కాంగ్రెస్ నుంచి చేరిన వారు మాజీ పీసీసీ చీఫ్ మాజీ మంత్రి సాకె శైలజానాథ్. ఆయన మెడలో వైసీపీ కండువా కప్పి సాదరంగా జగన్ ఆహ్వానించారు. ఇక శైలజానాథ్ వైసీపీ సీనియర్ నేతగా పలు వెబ్ చానళ్ళకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు.ఇదిలా ఉంటే ఆయన వైసీపీ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఏపీలో ఎన్డీయే వ్యతిరేక భావజాలం ఉండి తీరాల్సిందే అంటున్నారు బీజేపీ యాంటీ భావజాలం కలిగిన వారు తప్పకుండా వైసీపీని బలపరుస్తారని అంటున్నారు. ఏపీలో రాజకీయాన్ని కేవలం వైసీపీకి 11 సీట్లు వచ్చాయనో నేతలు పార్టీ నుంచి పోతున్నారనో లెక్క వేయకూడని అంటున్నారు.

రెండు బలమైన సిద్ధాంతాల మధ్య పోరుగానే చూడాలని అన్నారు. ఎండీయే కూటమి ఏపీలో అధికారంలో ఉందని దాని వ్యతిరేక కూటమిగా వైసీపీ ఉందని అన్నారు. ఈ భావజాలాన్ని బలపరచేవారు కూడా అత్యధిక శాతం ఉన్నారని అన్నారు. మరో వైపు చూస్తే రాష్ట్రంలో రాజకీయం నిలువునా చీలిపోయింది అని అన్నారు.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ భావజాలం అంతా వైసీపీలో ఉన్నపుడు కాంగ్రెస్ లోని నాయకులు అంతా ఈ క్లిష్ట సమయంలో ఎన్డీయే వ్యతిరేక శిబిరానికి వచ్చి బలపరచాల్సి ఉందని అన్నారు తాను అయితే వైసీపీలో చేరి పనిచేయాలని అనుకున్నానని అన్నారు. మిగిలిన కాంగ్రెస్ నాయకులు అంతా కూడా రావాలన్నది జనం కోరిక ఉందని అన్నారు.ఇక తాను వెళ్ళి మాట్లాడి పిలిచేటంత సీనియర్ ని కానని అన్నారు. తమ జిల్లాకు చెందిన రఘువీరారెడ్డి తమకు రాజకీయంగా గురువు లాంటి వారు అని అన్నారు. అలాగే ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి వారు వైఎస్సార్ తో కలసి పనిచేశారని అన్నారు. ఈ విధంగా సీనియర్లు ఎంతో మంది ఉన్నారు. అటువంటి వారు ఏ నిర్ణయం తీసుకోవాలన్నది వారికే బాగా తెలుసు అన్నారు.తాను మాత్రం తన



అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమలో వైసీపీ పటిష్టతకు కృషి చేస్తాను అని అన్నారు. అంతే కాదు జగన్ తనకు ఏ విధమైన బాధ్యత అప్పగించినా చేస్తాను అని అన్నారు ఇదిలా ఉంటే ఏపీలో మాత్రం కూటమి ప్రభుత్వానికి ఆపోజిట్ పాలిటిక్స్ అంటే మాత్రం వైసీపీయే సరైన వేదిక అని శైలజనాథ్ చెప్పారు.మొత్తానికి చూస్తే శైలజనాథ్ తారువాత చాలా మంది కాంగ్రెస్ నేతల పేర్లు వినిపించాయి. మాజీ ఎంపీ హర్షకుమార్, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, అలాగే రఘువీరారెడ్డి సహా ఇతర కీలక నేతలు అంతా పార్టీలో చేరుతారని ప్రచారం సాగింది. మరి శైలజనాథ్ అయితే తానుగా వైసీపీలో చేరాను అని చెప్పారు దాంతో కాంగ్రెస్ సీనియర్లతో సంప్రదింపులు జరిపి వైసీపీలోకి తెచ్చే బాధ్యతను ఆయన తన భుజానికి ఎత్తుకోవడం లేదని అంటున్నారు. చూడాలి మరి కాంగ్రెస్ నాయకులు అంతా వైసీపీలో చేరాలన్నది బీజేపీ వ్యతిరేక భావజాలాన్ని గెలిపించాలన్నది జనం కోరిక అని శైలజా నాథ్ అంటున్నారు. మరి ఆ విధంగా ఏపీ పాలిటిక్స్ మారుతుందా అన్నది చూడాల్సి ఉంది.

# కూలీ పనులు పరిశీలించి... పలుగు పారా పట్టిన కలెక్టర్

హైదరాబాద్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఉదయం టేకులపల్లి మండలంలోని సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రు తండా, కొత్త తండా గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పారా పట్టి పారం పాండు పనుల్లో పాల్గొన్నారు. స్వయంగా మట్టిని తట్టలోకి ఎత్తి దానిని మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకి భూగర్భ జలాలు ఉండాలంటే ప్రతి రైతు వ్యవసాయ భూములలో పారం పాండు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఉపాధి కూలీల సాధకబాధకలు తెలుసుకున్నారు. పలు గ్రామాలలో విద్యుత్ సమస్య, పోడు భూముల్లో విద్యుత్ సమస్యల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం రైతులకు మిర్చి వాణిజ్య పంటలే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే మునగ సాగు, వెదురు సాగుపై అవగాహన కల్పించారు. పలు గ్రామాలలో మునగ సాగు క్షేత్రాన్ని పరిశీలించారు. మునగ సాగుపై అధిక లాభం సాధించవచ్చని సూచించారు. కలెక్టర్‌తోపాటు డీఎల్‌పీఓ రమణ, మిషన్ భగీరథ డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి, ఎంపీడీవో రవీందర్ రావు, ఎంపీ ఓ గణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ